



వర్షం నీటితో కాలువను తలపిస్తున్న అచ్యుతాపురం మెయిన్ రోడ్డు

కూటమిలో ఆధిపత్య పోరు

మంత్రి నారాయణ సమక్షంలో జనసేన, టీడీపీ నేతల మధ్య వాగ్వాదం

- జనసేన ఎమ్మెల్యేలు ఉన్నచోట తమ మాటకూ విలువ ఇవ్వాలని కోరిన టీడీపీ ఇన్‌చార్జులు
- ఎమ్మెల్యేదే తుది నిర్ణయమని స్పష్టం చేసిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి):



పంచకర్ల రమేశ్‌బాబు



సుందరపు విజయ్‌కుమార్



గండి బాబ్జీ



ప్రగడ నాగేశ్వరరావు

కూటమిలోని టీడీపీ, జనసేన నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో బుధవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మిత్రపక్షాల మధ్య పెద్ద దుమారమే రేగింది. తొలుత టీడీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు/పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే (జనసేన) చెప్పిన పనులు మాత్రమే చేస్తున్నారని, పార్టీ ఇన్‌చార్జికి విలువ ఇవ్వడం లేదన్నారు. తమ సిఫారసులు కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేను 'నువ్వు' సంబోధించడంతో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ (జనసేన) జోక్యం చేసుకొని మర్యాదగా మాట్లాడాలని సూచించారు. అంతలో ఎలమంచిలి టీడీపీ నాయకుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు కల్పించుకొని తమ దగ్గర కూడా సమస్యలు ఉన్నాయని ప్రస్తావించారు. దీంతో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ, 'ఇది ఎమ్మెల్యేల సమావేశమా?, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జుల సమావేశమా?, అలాగైతే కూటమిలోని అన్ని పార్టీల ఇన్‌చార్జులను కూడా సమావేశానికి ఆహ్వానించాలి కదా?, ఒక్క టీడీపీ వారినే పిలవడం ఏమిటి?' అంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే సుందరపు మాట్లాడుతూ, ఎలమంచిలిలో '50 శాతం ఎమ్మెల్యే' తానేనంటూ ప్రగడ నాగేశ్వరరావు అధికారులను తన వద్దకు రావాలని బెదిరిస్తున్నారని, ఆయన ప్రతిపాదించిన అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారని...ఇలా '50 శాతం ఎమ్మెల్యే'లు ఎక్కడైనా ఉంటారా? అని ప్రశ్నించారు. ఈ దశలో ... మిగతా 8వ పేజీలో

దంచికొట్టిన వాన

ఉరుములు, పిడుగులతో పలుచోట్ల భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- డ్రైనేజీలు పొంగి.. రోడ్లపై ప్రవహించిన నీరు
- సబ్బవరం, మునగపాక మండలాల్లో పిడుగులు పడి మూడు ఆవులు మృతి
- చెరువులు, రిజర్వాయర్లలోకి స్వల్పంగా వరద నీరు
- ఉద్యాన పంటలకు మేలు చేసిన వర్షం
- చల్లబడిన వాతావరణంతో సేదతీరిన ప్రజలు



పరవాడలో కురుస్తున్న వర్షం

(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో బుధవారం దఫదఫాలుగా ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. బుధవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు, మధ్యాహ్నం, మళ్లీ సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. అనకాపల్లి, ఎలమంచిలి, పెందుర్తి, నర్సీపట్నం నియోజకవర్గాల్లోని అన్ని మండలాలతోపాటు రావికమతం, రోలుగుంట మండలాల్లో అధిక వర్షం కురిసింది. పలుచోట్ల రహదారులపై నీరు ప్రవహించి పంట కాలువలను తలపించాయి. డ్రైనేజీలు పొంగడంతో చెత్తాచెదారం, మురుగు.. రోడ్లపై పేరుకుపోయి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. కొన్నిచోట్ల చెరువుల్లో స్వల్పంగా నీరు చేరింది. కూరగాయలు, వేసవిలో విత్తిన నువ్వు పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని, పొలాలను దుక్కి చేయడానికి దోహదపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా నేల బాగా మెత్తబడడంతో చెరువులు, కాలువల్లో మట్టి పనులు సులువుగా చేయగలుతున్నట్టు ఉపాధి శ్రామికులు చెబుతున్నారు.

అనకాపల్లి పట్టణంలో రెండు పర్యాయాలు భారీ వర్షం కురిసింది. తొలుత తెల్లవారుజామున మొదలైన వర్షం ఉదయం ఎనిమిది గంటల వరకు కురుస్తూనే వుంది. మళ్లీ 11 గంటల నుంచి 12 గంటల వరకు భారీ వర్షం పడింది. ఆర్టీసీ కాంప్లెక్స్, విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి, భీమునిగుమ్మంతోపాటు పలు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. మొత్తం మీద 37 మి.మీ.ల వర్షం కురిసినట్టు ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు వెల్లడించారు. తాండవ రిజర్వాయర్ ... మిగతా 8వ పేజీలో



నాతవరం మండలం గుమ్మిడిగొండ పొలాల్లో చేరిన వర్షం నీరు.

రిజర్వాయర్లకు జలకళ

పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు

- కొద్ది రోజుల నుంచి రిజర్వాయర్లలోకి స్వల్పంగా వరద
- గత ఏడాదితో పోలిస్తే ఆశాజనకంగా నిల్వలు
- సకాలంలోనే ఆయకట్టుకు నీరు విడుదల చేసే అవకాశం



రైవాడ జలాశయం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని పలు జలాశయాల్లోకి నీరు చేరుతున్నది. దీనికితోడు గత ఏడాది డిసెంబరు మొదటి వారంలో భారీ వర్షాలు పడడం, ఆ తరువాత ఆయకట్టుకు నీటి అవసరం పెద్దగా లేకపోవడంతో రిజర్వాయర్లలో నీటి నిల్వలు స్థిరంగా కొనసాగాయి. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే అన్ని జలాశయాల్లో నీటి మట్టాలు ఎక్కువగానే వున్నాయి.

జిల్లాలో తాండవ, రైవాడ, పెద్దేరు, కోనాం, కల్యాణపులోవ, రావణాపల్లి, తదితర రిజర్వాయర్ల పరీవాహన ప్రాంతాలు అల్లూరి సీతారామరాజు జిల్లాలో వున్నాయి. ఏప్రిల్ మూడో వారం నుంచి ఇప్పటి వరకు ఏజెన్సీలో తరచూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఏజెన్సీని ఆనుకొని వున్న అనకాపల్లి జిల్లాలోని రిజర్వాయర్లలోకి వరద నీరు చేరుతున్నది. జల వనరుల శాఖ సమాచారం మేరకు బుధవారం తాండవ జలాశయంలోకి 206, రైవాడలోకి 169, కోనాంలోకిఇ 30, పెద్దేరు జలాశయంలోకి 35 క్యూసెక్కుల నీరు చేరుతున్నది. తాండవ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 380 అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 365 అడుగులు వుంది.. గత ఏడాది ఇదే రోజున 355.7 అడుగులు మాత్రమే వున్నట్టు ప్రాజెక్టు డీఈఈ తెలిపారు. రైవాడ రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 14 మీటర్లుకాగా ప్రస్తుతం 111 మీటర్లు వుంది. గత ఏడాది ఇదే రోజున 104.75 మీటర్లు ఉంది. కోనాం జలాశయంలో 101.25 మీటర్లకు 95.7 మీటర్లు నమోదైంది. గత ఏడాది ఇదే రోజున 95.4 మీటర్లు ఉంది. పెద్దేరు రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 134.9 మీటర్లు ఉంది. గత ఏడాది 135.65 మీటర్లు ఉంది. నైరుతి రుతుపవనాలు రాకముందు జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా వుండడంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆయకట్టుకు సకాలంలోనే నీటిని విడుదల చేసే అవకాశం వుందని జలవనరుల శాఖ అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జూన్ 2 వరకు జేసీ సెలవు

అనకాపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి):



ఎం.జాహ్నవి, జేసీ

జాయింట్ కలెక్టర్ జాహ్నవి వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ఈ నెల 19వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు సెలవు కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. సీఎస్ నుంచి ఆమోదం లభించడంతో ఇన్‌చార్జి బాధ్యతలను కలెక్టర్ విజయకృష్ణన్‌కు అప్పగించారు.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పోలీసు సేవలు

- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండా మొబైల్ యాప్ ద్వారా పోలీసు సేవలు పొందే అవకాశం కల్పిస్తున్నామని ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల ఎఫ్ఐఆర్‌ను సులభంగా, వేగంగా డిజిటల్ రూపంలో పొందవచ్చని పేర్కొన్నారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేసేందుకు 'ప్రజల సేవలో స్మార్ట్ పోలీసింగ్'ను వాట్సాప్ ద్వారా నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతించిందని పేర్కొన్నారు. 95523 00009 నంబర్‌ను మొబైల్ ఫోన్‌లో ఫీడ్ చేసుకుని, వాట్సాప్‌లో 'హాయ్' అని మెసేజ్ పెట్టడం ద్వారా ఎఫ్ఐర్ కాపీ డౌన్ లోడింగ్, ఎఫ్ఐఆర్ స్థితిని తెలుసుకొనే అవకాశం ఉందని ఎస్పీ చెప్పారు.

యూఎస్‌ఏ వినియోగదారులే టార్గెట్

అచ్యుతాపురం అడ్డాగా ఆన్‌లైన్ మోసాలు

- అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్లు అద్దెకు తీసుకుని ఆఫీసు ఏర్పాటు
- వంద మంది వరకు సిబ్బంది
- అంతా ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వారే
- ముంబై నుంచి నిర్వహిస్తున్న మహిళ
- ప్రముఖ సంస్థ తరహా యాప్‌లో వస్తువుల మార్కెటింగ్
- తక్కువ ధరకు అమ్ముతున్నట్టు వల
- వినియోగదారులకు ఖాళీ పార్శిళ్లు
- ఏడాది నుంచి సాగుతున్న అక్రమాలు
- ఇంతవరకు రూ.3 కోట్లకుపైగా స్వాహా?
- దర్యాప్తు పూర్తయిన తరువాత వివరాలు వెల్లడిస్తామన్న డీఎస్పీ



ఆన్‌లైన్ మార్కెటింగ్ కాల్‌సెంటర్ నిర్వహిస్తున్న భోగాపురంలోని అపార్టుమెంట్ ఇదే..

అచ్యుతాపురం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో మోసాలకు పాల్పడుతున్న ముఠాను జిల్లా పోలీసులు పట్టుకున్నారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ నేతృత్వంలో పలువురు సీఐలు, ఎస్ఐలు, సుమారు 100 మంది పోలీసు సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ సోదాలకు సంబంధించి పూర్తి వివరాలను బుధవారం సాయంత్రం వరకు పోలీసు అధికారులు వెల్లడించలేదు. అయితే విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లోని కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నట్టు కొంతమంది వ్యక్తులు అచ్యుతాపురం, చుట్టుపక్కల గ్రామాల్లోని అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లను అద్దెకు తీసుకుని నివాసం వుంటున్నారు. ఇక్కడ పకడ్బందీగా కాల్‌సెంటర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్ మార్కెటింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా యూఎస్ఏలో వున్న వినియోగదారులను టార్గెట్‌గా చేసుకున్నట్టు తెలిసింది. వీరిలో ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చిన యువతీ యువకులు ఎక్కువగా వున్నట్టు చెబుతున్నారు. మండల కేంద్రానికి సమీపంలోని భోగాపురం జార్జి లేఅవుట్‌లో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లో మూడు ఫ్లాట్లను అద్దెకు తీసుకున్నారు. యూఎస్ఏలో వున్న వినియోగదారులకు ఒక ప్రముఖ సంస్థ లాంటి యాప్‌ల ద్వారా తక్కువరేటుకు ఉత్పత్తులను చూపించి, వస్తువు రేటులో కొంతమొత్తాన్ని ముందుగా చెల్లించి ఆర్డర్ బుక్ చేసుకోవాలని చెబుతారు. డబ్బులను తమ ఖాతాల్లో మళ్లించుకుని వస్తువులు పంపకుండానే పంపినట్టు మోసం చేస్తున్నారు. వస్తువు తమకు చేరలేదని వినియోగదారులు ఫిర్యాదుచేస్తే.. మరికొంత డబ్బులు చెల్లిస్తేనే ... మిగతా 8వ పేజీలో

నేడు టీడీపీ జిల్లా మహానాడు

ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు వద్ద సభ ఏర్పాట్లు

- పార్టీ శ్రేణులంతా తరలిరావాలి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు. పక్కన లాలం కాశినాయుడు

అనకాపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లాస్థాయి మహానాడును గురువారం పాయకరావుపేట నియోజకవర్గంలోని ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు జంక్షన్ సమీపంలో నిర్వహిస్తున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు చెప్పారు. ఆయన బుధవారం ఇక్కడ టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ మినీ మహానాడుకు కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులు తరలిరావాలని కోరారు. ఉదయం 9.30 గంటలకు సభ ప్రారంభంఅవుతుందని, ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రతోపాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ అనుబంధ సంఘాలు, ఇతర కేడర్ హాజరవుతారని తెలిపారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశినాయుడు మాట్లాడుతూ, ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మినీ మహానాడును విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులంతా కదిలి రావాలని పిలుపునిచ్చారు.



మినీ మహానాడు సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత

ఏర్పాట్లను పరిశీలించిన హోం మంత్రి అనిత

ఎస్.రాయవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డురోడ్డులో మినీ మహానాడు సభ ఏర్పాట్లను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ మహానాడుకు జిల్లా నుంచి వార్డుస్థాయి వరకు నాయకులు, ప్రజాప్రతినిధులతోపాటు సుమారు పది వేల మంది కార్యకర్తలు హాజరవుతారని, ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఆమె వెంట నియోజకవర్గం నాయకులు అమలకంటి అబద్దం, లాలం కాశినాయుడు, కొప్పిశెట్టి వెంకటేశ్, కురందాసు నూకరాజు, చించెలపు ప్రదీప్ తదితరులు వున్నారు.

ఉమ్మడి జిల్లాలో 93 హెచ్‌ఎం పోస్టులు ఖాళీ

- బదిలీ కోసం దరఖాస్తుకు నేటి వరకూ గడువు
- ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో హెల్ప్‌డెస్క్



విశాఖపట్నం/ఆరిలోవ, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ, మునిసిపల్, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో 93 గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు జిల్లా విద్యా శాఖ గుర్తించింది. ఒక పాఠశాలలో ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాలో అటువంటి హెచ్‌ఎంలు 15 మంది ఉన్నారు. గత ఏడాదిగా 46 ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు పదవీ విరమణ చేయడంతో ప్రస్తుతం ఆ ఖాళీలను భర్తీచేస్తారు. జిల్లాలో 24 యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడంతో కొత్తగా 24 హెచ్‌ఎం పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇటీవల భీమిలి డైట్‌కు లెక్చరర్లుగా ఇద్దరు హెచ్‌ఎంలు వెళ్లడంతో ఆ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అలాగే బాలికల పాఠశాలల్లోని హెచ్‌ఎంలు ఆరుగురు బదిలీ కానున్నారు. దీంతో మొత్తం ఉమ్మడి జిల్లాలో 93 హెచ్‌ఎం పోస్టులు బదిలీల కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేకపోతే కేటగిరీ-4లో ఉన్న పోస్టులకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. బదిలీలకు గురువారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బదిలీల దరఖాస్తు చేసే సమయంలో సందేహాల నివృత్తికి సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ ఉన్నత పాఠశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు హెల్ప్ డెస్క్ పనిచేస్తుందని చెప్పారు.

యోగాతో శారీరక, మానసిక ఒత్తిళ్లు దూరం

- రోజూ కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలి
- కలెక్టర్ విజయకృష్ణన్



బొజ్జన్నకొండ వద్ద యోగా చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, తదితరులు

తుమ్మపాల, మే 21 (ఆంధ్రజ్యోతి): యోగాకు ప్రతి ఒక్కరూ రోజు కొంత సమయం కేటాయించాలని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. యోగాంధ్ర-2025లో భాగంగా బుధవారం బొజ్జన్నకొండ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, ఆరోగ్యమే సంపద అని, యోగాతో శారీరక, మానసిక ఒత్తిడిలను అధిగమించవచ్చని అన్నారు. యోగా సాధనతో శరీర రుగ్మతలను సైతం తొలగించుకోవచ్చునన్నారు. వచ్చే నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నామని, దీనికి సంబంధించి ప్రభుత్వం యోగాంధ్ర యాప్‌ను రూపొందించిందని, దీనిని ప్రతి ఒక్కరూ డౌన్ లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం యోగా లైఫ్ ఫైండేషన్ వ్యవస్థాపకులు కె.బాబురావు ఆధ్వర్యంలో కలెక్టర్‌తోపాటు పలువురు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ, ఇన్‌చార్జి ఆర్డీవో వై.శ్రీనివాసరావు, అధికారులు డాక్టర్ శిరీషా, కె.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక 'జనవాణి'

▸▸ అర్జీల స్వీకరణలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



జనసేన కార్యాలయంలో అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

రాంబిల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జనవాణి చక్కని వేదికగా నిలుస్తుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని హరిపురంలో గల పార్టీ కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతున్నట్టు చెప్పారు. పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. పలువురి నుంచి స్వయంగా అర్జీలను స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులు సకాలంలో పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. అనంతరం పదమూడు మందికి సుమారు రూ.తొమ్మిది లక్షల మేర ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్షుడు బి.శ్రీరామదాసు, పలువురులు అధికారులు పాల్గొన్నారు.

రేపు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎలమంచిలి, మే 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ ఏఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఈ కారణంగా ఎలమంచిలిలోని మిలటరీ కాలనీ, కొత్తపేట, యానాద్రి కాలనీ, స్టేషన్ రోడ్డు, మెయిన్ రోడ్డు, ద్వారకానగర్, నెహ్రూనగర్, ఎర్రవరం, కొత్త ఎర్రవరం, లైనుకొత్తూరు, సోమన్నపాలెం, సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడు పాలెం, కొత్తపాలెంలలో ఆ రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని వివరించారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

నాగులాపల్లిలో వెంకన్న ఆలయ వార్షికోత్సవం రేపు

మునగపాక, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగులాపల్లి గ్రామంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయన 12వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు ఆలయ కమిటీ చైర్మన్ దాడి ప్రకాశ్ తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

మునగపాక, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆధ్వర్యంలోరామాలయం వద్ద ఈ శిబిరాన్ని నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్‌కు చెందిన వైద్య సిబ్బందికి పలువురికి కంటి పరీక్షలు జరిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి గుర్తించారు. కొందరికి అవసరమైన మందులు అందజేశారు.

వైసీపీ మండల అధ్యక్ష పదవికి సత్యనారాయణ రాజీనామా

గొలుగొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్ష పదవికి లెక్కల సత్యనారాయణ బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు నర్సీపట్నంలో క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేశ్‌కు రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశానని, పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా పనిచేస్తానని పేర్కొన్నారు.

మండు వేసవిలో కుండపోత

▸▸ అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో ఎటు చూసినా నీరే ▸▸ పలుచోట్ల చెరువులను తలపించిన ప్రధాన జంక్షన్లు, రోడ్లు



భారీ వర్షానికి చెరువులా మారిన అచ్యుతాపురం ప్రధాన జంక్షన్

అచ్యుతాపురం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు కమ్ముకుని ఉండగా, పది గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కుండపోతగా వాన పడింది. దీంతో ఎటు చూసినా నీరే కనిపించింది. పలు గ్రామాల రోడ్లు చిత్తడిగా మారాయి. పంటపొలాలు, పంటకాలువల్లో నీరు చేరింది. అచ్యుతాపురం, మోసయ్యపేట, వెదురువాడ తదితర గ్రామాల్లో పలు ఇళ్ల మధ్య నీరు నిలిచిపోయింది. అచ్యుతాపురం ప్రధాన జంక్షన్, నాలుగురోడ్ల కూడలి చెరువును తలపించాయి. ఫలితంగా రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. గత కొన్నాళ్లుగా ఉష్ణతాపానికి అల్లాడిపోయిన మండల ప్రజలు తాజా వాతవరణంతో సేదదీరారు.

రాంబిల్లి మండలంలో...

రాంబిల్లి : మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం పది గంటల సమయంలో, సాయంత్ర నాలుగున్నర గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కుండపోతగా వాన పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన జంక్షన్లు, పలు రోడ్లు చెరువులుగా మారాయి. రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇన్నాళ్లు ఉష్ణతాపంతో అల్లాడిన ప్రజానీకం వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. ఈ వర్షాలుక పలు పంటలు పండించుకునేందుకు ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రాంబిల్లి- జంగాలపాలెంలోని హరిపురం వెళ్లే మట్టి రోడ్డు దుస్థితి

ఎలమంచిలి మండలంలో...

ఎలమంచిలి : పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైంది. ఉదయం పది గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో వర్షం పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది

పిడుగుపాటుతో ఆవు మృతి



మునగపాక : ఉరుములు, మెరుపులతో మునగపాక మండలంలో మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. రాకపోకలకు జనం ఇబ్బందులు ఎదర్కొన్నారు. వాడ్రాపల్లిలో పిడుగుపాటుకు బీశెట్టి జోగినాయుడుకు చెందిన ఆవు మృతి చెందింది. ఈ పాడి ఆధారంగా కుటుంబం జీవనం సాగిస్తున్నామని, ఇది మృతిచెందడంతో నష్టపోయామని బాధితుడు వాపోయాడు. అధికారులు ఆదుకోవాల్సిందిగా కోరాడు.

సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి : డీపీవో



సిబ్బందికి సూచనలిస్తున్న డీపీవో శిరీషారాణి

మునగపాక, మే 21 (ఆంధ్రజోతి) : సంపద కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీ అధికారిణి ఆర్.శిరీషారాణి ఆదేశించారు. మండలం లోని మునగపాక, తిమ్మరాజుపేటలలో గల సంపద కేంద్రాలను బుధవారం ఆమె సందర్శించారు. తడి, పొడి చెత్త ఏ విధంగా సేకరిస్తున్నదీ, దానిని సంపద కేంద్రంలో రీసైక్లింగ్‌తో పాటు వర్మీ కం పోస్టు తయారీ తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సంపద కేంద్రాల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. అలాగే, గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు అంతా ప్రాధాన్యం ఇచ్చేలా కార్యదర్శులు చైతన్యవంతం చేయాలని సూచించారు. ఈ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కృష్ణంరాజు కాలువలో పూడిక తొలగింపు : ఇరిగేషన్ జేఈ

మునగపాక, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాక మెయిన్ రోడ్డును ఆనుకున్న ఉన్న కృష్ణంరాజు కాలువలో గురువారం పూడిక తొలగింపును ప్రారంభించనున్నామని ఇరిగేషన్ జేఈ సుప్రియ తెలిపారు. ఈ కాలువ పరిధిలో సుమారు నాలుగు గ్రామాల రైతులకు సంబంధించి 800 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ కాలువలో పూడికతీత పనులు చేపట్టలేదు. దీంతో పంట పొలాలకు సరిగా నీరందక పెద్దగా పంటలు పండేవి కావు. ఈ సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఆయా ఆయకట్టు రైతులు తీసుకు వెళ్లారు. దీనిపై కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశాల మేరకు పూడిక తొలగింపు చేపట్టనున్నామని జేఈ వివరించారు.

హనుమజ్జయంతికి ఆలయాలు ముస్తాబు



యర్రవరంలో కొలువుదీరిన స్వామివారు

ఎలమంచిలి, మే 21 (ఆంధ్రజ్యోతి) : హనుమజ్జయంతికి ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల్లో గల స్వామివారి ఆలయాలు ముస్తాబయ్యాయి. గురువారం ఉదయం నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. ఎలమంచిలి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్, తులసీనగర్ సమీపంలోని చతుర్ముఖ ఆంజనేయ, పెదపల్లి, కొక్కిరాపల్లి తదితర వార్డులతో పాటు ఏటికొప్పాక, పీఎన్ఆర్‌పేట, పులపర్తి, పోతిరెడ్డిపాలెం, లైనుకొత్తూరు గ్రామాల్లోని ఆలయాల్లో కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పలుచోట్ల మధ్యాహ్నం అన్నసమారాధన జరపనున్నారు.

రోడ్డు విస్తరణ నేపథ్యంలో వైఎస్ విగ్రహం తరలింపు



క్రేన్ సాయంతో విగ్రహాన్ని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం అచ్యుతాపురంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని బుధవారం సురక్షిత ప్రాంతానికి తరలించే ఏర్పాట్లు చేశారు. పదేళ్ల క్రితం ఈ విగ్రహాన్ని ఇక్కడ ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. అచ్యుతాపురం జంక్షన్ విస్తరణలో భాగంగా ఈ విగ్రహం తొలగింపు అనివార్యమైంది. దీంతో వైసీపీ నాయకులు కోన బుజ్జి, పంచదార్ల పైడిరాజు, శనివాడ జువ్వలనాయుడు తదితరుల సమక్షంలో విగ్రహాన్ని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక స్థలాన్ని సిద్ధం చేశారు.

ఉపాధి బకాయిల కోసం కూలీల ఆందోళన

▸▸ పందూరులో రహదారిపై బైఠాయించిన నిరసన



పందూరు రహదారిపై బైఠాయించి నినాదాలు చేస్తున్న ఉపాధి కూలీలు

కోటవురట్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని వ్యవసాయ, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ చెప్పారు. మండలంలోని పందూరు గ్రామంలో వ్యవసాయ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింది పని చేస్తున్న కూలీలకు పది వారాల నుంచి వేతన బకాయిలు చెల్లించకపోవడంపై బుధశారం కూలీలు నిరసన ప్రదర్శనల చేశారు. ఈ సందర్భంగా పందూరు రహదారిపై బైఠాయించి బకాయిల కోసం నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేతనాలు సకాలంలో అందక కూలీలు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిరాణా దుకాణాల దగ్గర అరువు తీసుకున్న సరకులకు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో వ్యాపారులు ఇంటికి వచ్చి గొడవ పడుతున్నారని అసహనం వ్యక్తం చేవారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు వంద రోజుల ఉపాధికి గ్యారంటీ కల్పించాలని, ఉన్న ఊరిలోనే పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. యుక్తధార మొబైల్ యాప్ ఇప్పటికే ప్రారంభమైందని, తొలి దశలో జిల్లా వ్యాప్తంగా మండలానికో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని అమలు చేస్తున్నదని చెప్పారు. రెండో దశలో అన్ని గ్రామాల్లోనూ అమలు చేస్తుందన్నారు. ఈ యాప్ వల్ల ఉపాధి పథకంపై రాష్ట్రాలు తమ హక్కులను పూర్తిగా కోల్పోవడం జరుగుతుందన్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొత్త మెలిక పెట్టి ఉపాధి ఉసురు తీయాలని చూస్తుందని పేర్కొన్నారు.

పుస్తక పఠనంపై ప్రత్యేక శిక్షణ



పాయకరావుపేటలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ పదాలు తెలుగులో చెప్పడం, హిందీలో మాట్లాడడంతో పాటు స్పోకెన్ ఇంగ్లీషు, డైరీ రాయించడం తదితర అంశాలపై శిక్షకులు ప్రత్యేకంగా తర్ఫీదునిచ్చారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన జీవిత విశేషాలు, దేశానికి ఆయన అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. అదే విధంగా యోగా మాస్టారు రాజు విద్యార్థులకు సూర్య నమస్కారం, ప్రాణాయామాలు తదితర యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావుతో పాటు వివిధ తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

మినీ మహానాడును విజయవంతం చేయండి

ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల టీడీపీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, కొప్పిన వెంకటేశ్



అడ్డరోడ్డు సమీపంలో విలేకర్లతో మాట్లాడుతున్న అబద్ధం, వెంకటేశ్

ఎస్.రాయవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో బుధవారం జరగనున్న జిల్లా స్థాయి మినీ మహానాడును విజయవంతం చేయాలని ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల టీడీపీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, కొప్పిన వెంకటేశ్ పిలుపునిచ్చారు. అడ్డరోడ్డు సమీపంలోని మినీ మహానాడు సభ ప్రాంగణం వద్ద వారిద్దరూ విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహానాడు సభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. మహానాడు సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, జిల్లా, నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులు పాల్గొంటారన్నారు. టీడీపీ శ్రేణుల కోసం ఇప్పటికే సభా ప్రాంగణం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వారు చెప్పారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తగిన చర్యలు చేపట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, తుంపాల నాగేశ్వరరావు, అల్లు నరసింహమూర్తి, పల్లెల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో రహదారులు అధ్వానం

▸▸ చినుకు పడితే బురదమయం.. రాకపోకలకు నరకం



నామవరం కాలనీలో గెడ్డను తలపిస్తున్న ప్రధాన రహదారి

పాయకరావుపేట రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నామవరం జగనన్న కాలనీలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. చినుకులు పడితే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా బురదమయంగా తయారవుతున్నాయి. దీంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి ప్రత్యక్ష నరకం చవిచూస్తున్నారు.


నామవరం జగనన్న కాలనీలో నామవరం, గుంటపల్లి, సీతారాంపురం, గ్రామాలకు చెందిన సుమారు 136 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. అందరూ ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే ఇంతవరకు రోడ్లు మాత్రం నిర్మించలేదు. లేఅవుట్ వేసినపుడు గ్రావెల్ రోడ్లు వేసినా వెంటనే పాడయ్యాయి. రోడ్లన్నీ గోతులు ఏర్పడి వర్షం నీరు చేరి బురదమయంగా మారడంతో నడవడానికి కూడా అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి జగనన్న కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు కూడా అస్తవ్యస్తమైందని, రాత్రులు ప్రయాణం చేయాలంటే నరకయాతన చూస్తున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు, కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.



కాలనీలో బురదమయమైన గ్రావెల్ రహదారి

ఉమ్మడి జిల్లాలో తాగునీటి పథకాల నిర్వహణకు రూ.14 కోట్లు

జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి



మాకవరపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో తాగునీటి పథకాల నిర్వహణకు రూ.14 కోట్లు మంజూరయ్యాయని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 45 తాగునీటి పథకాలు ఉన్నాయని, 2024-25లో వీటి నిర్వహణకు రూ.6 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. ఈ ఏడాదికి రూ.31 కోట్లతో ప్రతిపాదనలు పంపగా, ప్రసుత్తం రూ.14 కోట్లు విడుదలయ్యాయని ఆయన చెప్పారు. ఈ నిధులు 15వ ఆర్థిక సంఘం నుంచి ఖర్చు చేస్తున్నామన్నారు. అలాగే ఈ ఏడాది వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా బోర్లు, నీటి పథకాల మరమ్మతు పనులు చేపట్టామన్నారు. అలాగే వర్షాలు కురవడంతో ఎక్కడా తాగునీటి సమస్య లేదని ఆయన చెప్పారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై విచారణ

మండల పరిషత్ దుకాణాల వేలం నిర్వహించాలని పీజీఆర్ఎస్‌లో చేసిన ఫిర్యాదుపై జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి బుధవారం విచారణ చేపట్టారు. పది దుకాణాలకు వేలం లేకుండా 15 ఏళ్లుగా అతి తక్కువ చెల్లించి నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని మాకవరపాలెం గ్రామానికి చెందిన పి.ఫ్రాన్సిస్ చేసిన ఫిర్యాదుపై ఈ విచారణ జరిగింది. మండల కేంద్రంలో ప్రస్తుతం ప్రైవేటు దుకాణాలకు రూ.8 నుంచి రూ.10 వేల అద్దె చెల్లిస్తున్నారని, మండల పరిషత్ దుకాణాలకు రూ.4 వేలు మాత్రమే అద్దె నిర్ణయించడం ఎలా సాధ్యమని నిలదీశారు. దీనికి సీఈవో స్పందిస్తూ త్వరలో వేలం ప్రకటన ఇస్తామని తెలిపారు.

మినీ మహానాడుకు తరలిరండి

నక్కపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం మండలంలోని అడ్డరోడ్డు కేంద్రంగా గురువారం జరగనున్న టీడీపీ జిల్లా మినీ మహానాడు కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా తరలిరావాలని టీడీపీ మండల నాయకులు పిలుపునిచ్చారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ, నాయకులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి కొండబాబు, వైబోయిన రమణ, బుజ్జి, గింజాల లక్ష్మణరావు, మేరుగు నాగేశ్వరరావు తదితరులు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ హోం మంత్రి అనిత నేతృత్వంలో మినీ మహానాడు సభ కోసం అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు తరలిరావాలని వారు కోరారు.

వస్తువులకు రశీదులు ఇవ్వాలి

నక్కపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉపమాక వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా తాము స్వామివారికి ఇచ్చిన బంగారు వస్తువులకు సంబంధించి రశీదులు ఇవ్వాలని ఎస్.రాయవరం మండలం వమ్మవరానికి చెందిన శ్రీకాకుళపు బంగారుశెట్టి , ఉపమాకకు చెందిన కర్రి గురువోజీ కోరారు. బుధవారం ఆలయ మాజీ చైర్మన్ కొండబాబు ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావును కలిసి వినతిపత్రాలు అందజేశారు.

ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులకు తాను తులం బంగారు శతమానాలను స్వామివారి సేవ నిమిత్తం అందజేశానని బంగారుశెట్టి చెప్పారు. ,ఉపమాకకు చెందిన కర్రి గురువోజీ తానిచ్చిన పావుతులం బంగారానికి కూడా రశీదు ఇవ్వాలని కోరారు. తనకు బంగారు వస్తువులేవీ అందలేదని ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు చెప్పారు. కాగా ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులను సంప్రదించగా భక్తులు సమర్పించే బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులకు రశీదు ఇచ్చే అధికారం తమకు లేదని స్పష్టం చేశారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

నక్కపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అనేక గ్రామాల్లోని ఆంజనేయస్వామి మందిరాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరగనున్నాయి. భక్తులకు స్వామివారి ప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడికి ఘన నివాళి

ఎస్.రాయవరం, మే 21 (ఆంధ్రజ్యోతి) : అడ్డరోడ్డులో ఇటీవల మరణించిన ఉపాధ్యాయుడు అప్పారావుకు పలువురు నాయకుడు బుధవారం ఘనంగా నివాళి అర్పించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తదితరులు అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


మండల పరిషత్ కార్యాలయంలో విచారణ చేస్తున్న జడ్పీ సీఈవో

పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై జడ్పీ సీఈవో విచారణ

మాకవరపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ దుకాణాల వేలం నిర్వహించాలని పీజీఆర్ఎస్‌లో చేసిన ఫిర్యాదుపై జడ్పీ సీఈవో పి.నారాయణ మూర్తి బుధవారం విచారణ చేపట్టారు. పది దుకాణాలకు వేలం లేకుండా 15 ఏళ్లుగా అతి తక్కువ అద్దె చెల్లించి ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని మాకవరపాలెం గ్రామానికి చెందిన పి.ఫ్రాన్సిస్ ఇటీవల చేసిన ఫిర్యాదుపై ఈ విచారణ జరిగింది. గత నెలలో వేలం నిర్వహిస్తున్నామని మండల పరిషత్ సభ్యులు పత్రికా ప్రకటన ఇచ్చారని, మళ్లీ ప్రకటన లేకుండా ఎందుకు వేలం వాయిదా నిలిపి వేశారని సీఈవోను ఫిర్యాదుదారుడు ప్రశ్నించారు. అలాగే మండల కేంద్రంలో ప్రస్తుతం ప్రవేటు దుకాణాలకు రూ.8 నుంచి రూ.10 వేల అద్దె చెల్లిస్తున్నారని, మండల పరిషత్ దుకాణాలకు రూ.4 వేలు మాత్రమే అద్దె నిర్ణయిండం ఎలా సాధ్యమని నిలదీశారు. దీనికి సీఈవో స్పందిస్తూ మండల పరిషత్ ఆదేశాల మేరకు దుకాణాల వేలం నిర్వహిస్తామని, తర్వలోనే వేలం ప్రకటన ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయిసుధా, ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి పథకాల నిర్వహణకు రూ.14 కోట్లు

జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి



మాకవరపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో తాగునీటి పథకాల నిర్వహణకు రూ.14 కోట్లు మంజూరయ్యాయని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 45 తాగునీటి పథకాలు ఉన్నాయని, 2024-25లో వీటి నిర్వహణకు రూ.6 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. ఈ ఏడాదికి రూ.31 కోట్లతో ప్రతిపాదనలు పంపగా, ప్రసుత్తం రూ.14 కోట్లు విడుదలయ్యాయని ఆయన చెప్పారు. ఈ నిధులు 15వ ఆర్థిక సంఘం నుంచి ఖర్చు చేస్తున్నామన్నారు. అలాగే ఈ ఏడాది వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా మందస్తుగా బోర్లు, నీటి పథకాల మరమ్మతు పనులు చేపట్టామన్నారు. అలాగే వర్షాలు కురవడంతో ఎక్కడా తాగునీటి సమస్య లేదని ఆయన చెప్పారు.

రేషన్ పంపిణీ నిర్ణయంపై డీలర్ల హర్షం

» ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు సత్కారం


ఎమ్మెల్యే రాజును సత్కరించి స్వీటు తినిపిస్తున్న రేషన్ డీలర్లు

చోడవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోల ద్వారా సరకుల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును సత్కరించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని, సరకుల పంపిణీలో ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు వద్ద డీలర్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు భైన ఈశ్వర రావు, నాయకులు గూనూరు శంకరరావు, బంగారంపాలెం రమేశ్, వెంపలి నానాజీ, జ్యోతుల శ్రీను, దాముసాపల్లి శ్రీను పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

దేవరాపల్లి: రేషన్ సరకులను పాత పద్ధతిలో డీలర్ల ద్వారా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంపై డీలర్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అలాగే ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం ప్రతినిధులు స్వామి నాయుడు, రాజేశ్, వెత్సా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో...

మాడుగుల: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా రేషన్ పంపిణీ చేయాలని నిర్ణయించడంపై డీలర్ల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సంఘం మండల అధ్యక్షుడు చింతా వెంకట నారాయణమూర్తి ఆధ్వర్యంలో మాడుగుల బస్టాండ్ వద్ద పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్‌రెడ్డి, అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఈర్లె సురేశ్, కార్యదర్శి పెంటకోట జగన్నాథరావు, డీలర్లు పాల్గొన్నారు.

యోగా పోటీల విజేత దైవజ్ఞకు కలెక్టర్ అభినందన


దైవజ్ఞను సత్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

చోడవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన విద్యార్థి దైవజ్ఞను కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం అభినందించారు. వచ్చే నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి అనకాపల్లి బొజ్జన్నకొండ వద్ద యోగ ఆంధ్ర కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా అంతర్జాతీయ పోటీల్లో సత్తాచాటిన పతంజలి యోగా కేంద్రం విద్యార్థి దైవజ్ఞను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏపీ యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సతీశ్ పాల్గొన్నారు.

రాజాంలో ఆర్మీ జవాన్‌కు ఘన సత్కారం


జవాన్ అశోక్‌ను సత్కరిస్తున్న రాజాం గ్రామస్థులు

బుచ్చెయ్యపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజాం గ్రామంలో జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆర్మీ జవాన్ అశోక్‌ను బుధవారం గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. మూడేళ్లుగా జమ్మూకాశ్మీర్‌లోని పారాముల్లా సెక్టార్-10లో అశోక్ సైనికునిగా పనిచేస్తున్నారు. పహల్గాం దాడి జరిగినపుడు 20 కిలోమీటర్ల దూరంలో ఆయన విధులు నిర్వహించారు. దాడి అనంతరం కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో కూడా అశోక్ సేవలు అందించారు. ఆయన సెలవుపై మంగళవారం స్వగ్రామం రాజాం చేరుకున్నారు. యుద్ధంలో పాల్గొని క్షేమంగా వచ్చిన అశోక్‌ను స్థానిక యువకులు, ఆకుల ఫౌండేషన్ సభ్యులు నాగేశ్వరరావు, అండమాన్ దుర్గ, గ్రామస్థులు సత్కరించారు. సన్మానగ్రహీత అశోక్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ఆర్మీలో పని చేయడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఇదేనా.. చె(చి)త్తశుద్ధి?

ఇందిరా మార్కెట్‌లో 'చెత్త' వాతావరణం

» పరిసరాల్లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్తాచెదారం

» చేపలు, మాంసం దుకాణాల వద్ద పారిశుధ్య లోపం

» భరించలేని దుర్గంధం.. ప్రజల్లో వ్యాధుల భయం


ఇందిరా మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్త కుప్పలు


మాంసం దుకాణాల వద్ద లోపించిన పారిశుధ్యం

పట్టణంలోని ఇందిరా మార్కెట్‌లో 'చెత్త' వాతావరణం నెలకొంది. పరిసరాల్లో చెత్తాచెదారం గుట్టల్లా పేరుకుపోయింది. దుకాణాల చెంతన పారిశుధ్యం లోపించింది. అడుగు తీసి అడుగు వేయలేనంత దారుణంగా పరిస్థితి తయారైంది. దీనికితోడు వర్షాలకు చెత్త కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా జనాలను వ్యాధుల భయం వెంటాడుతోంది.

నర్సీపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి):

పట్టణంలోని ఇందిరా మార్కెట్ పరిసరాల్లో ప్రజలు నివసిస్తున్నారు. అలాగే సమీపంలోనే ఎన్టీఆర్ మినీ స్టేడియం, షిరిడి సాయిబాబా గుడి కూడా ఉన్నాయి. మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో ప్రజలు గబ్బు భరించలేకపోతున్నారు. మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్త ఇటీవల కురుస్తున్న వర్షాలకు తడిచి కుళ్లిన కంపు కొడుతోంది. మాంసం, చేపల దుకాణాల వద్ద పారిశుధ్యం పూర్తిగా లోపించింది. మార్కెట్ చుట్టుపక్కల నివాసం ఉంటున్న ప్రజలు, ఎన్టీఆర్ మినీ స్టేడియానికి వచ్చే క్రీడాకారులు, సీనియర్ సిటిజన్లు, షిరిడి సాయిబాబా గుడికి వచ్చే భక్తులు మార్కెట్ దుర్వాసన భరించలేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోళ్లు, చేపలు, కూరగాయల వ్యర్థాలు కుళ్లిపోవడంతో చెడు వాసన అన్ని వైపులా వ్యాపిస్తోంది. పందులు, కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. అపరిశుభ్రంగా కంపు కొడుతున్న ప్రదేశంలో విక్రయిస్తున్న చేపలు, మాంసం స్థానిక ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.

ప్రతి నెలా మార్కెట్ దుకాణాల మీద అద్దెలు రూపంలో రూ.3 లక్షలకు పైగా ఆదాయం తీసుకుంటున్న మండల పరిషత్ అధికారులు, కనీసం వారానికి ఒక రోజు కూడా శుభ్రం చేయించడం లేదని వ్యాపారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం మండల పరిషత్ తీసుకుంటుంది, కాబట్టి వారే శుభ్రం చేయించుకోవాలన్న రీతితో మునిసిపల్ శానిటేషన్ విభాగం ఉంది. అధికారుల్లో చిత్తశుద్ధి లోపించడంతోనే చెత్త వాతావరణం నెలకొంటున్నదని జనాలు గగ్గోలు పెడుతున్నారు. వ్యాధులు ప్రబలక ముందే మార్కెట్‌లో ఈ చెత్త సమస్యను పరిష్కరించాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.


చెత్త కుప్ప వద్ద చేపలు శుభ్రం చేయుస్తున్న దృశ్యం


మార్కెట్‌లోని బురదలో నడుకుంటూ వస్తున్న మహిళ

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

నర్సీపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నర్సీపట్నం మెయిన్ రోడ్డులో మురుగు ప్రవహించింది. శారదానగర్, వెంకునాయుడుపేట, బ్యాంకు కాలనీలో మోకాళ్ల లోతు నీరు చేరింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోతగా ఉన్న వాతావరణం 12.30 గంటలు ఆకాశం కారుమబ్బులు కమ్ముకొని గంటన్నర పాటు కుండపోత వర్షం కురిసింది.

రావికమతంలో...

రావికమతం: మండలంలో మూడు రోజులుగా వర్షం కురుస్తున్నది. ఉక్కపోతతో ఇబ్బందులు ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కల్పించింది. వాతావరణం చల్లబడడంతో వారు ఊపిరి తీసుకున్నారు.

గొలుగొండలో...

గొలుగొండ/కృష్ణాదేవిపేట: మండల కేంద్రంతో పాటు కృష్ణాదేవిపేట, లింగంపేట, విప్పలపాలెం, ఏఎల్‌పురం, చోద్యం, సిహెచ్.నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో బుధవారం మోస్తరు వర్షం పడింది. కొంత కాలంగా ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఊరటనిచ్చింది. వర్షం కారణంగా కృష్ణాదేవిపేట బస్ స్టేషన్, గ్రామీణ మట్టి రోడ్లు, కాలువలు దారుణంగా మారాయి.


గొలుగొండ మండల చీడిగుమ్మల గ్రామంలో కురుస్తున్న భారీ వర్షం

నాతవరంలో...

నాతవరం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉరుములతో భారీ వర్షం పడింది. దీంతో పొలాల్లో వేసిన నువ్వు పంట నీటి మునిగింది. అలాగే ఇళ్ల ముందు వర్షపు నీరు భారీగా చేరటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అయితే వేసవి తాపంతో అల్లాడుతున్న జనాలకు ఈ వాన కాస్త ఉపశమనం కల్పించింది.


నాతవరంలో నీట మునిగిన నువ్వు పంట

రోలుగుంటలో...

రోలుగుంట: మండలంలో బుధవారం మోస్తరు వాన పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. వారం రోజులుగా తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, రెండు రోజులుగా కురుస్తున్న వానలతో ఉపశమనం పొందారు. ఈ వర్షంతో పలు గ్రామాల్లో రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం ఖరీఫ్‌లో పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.


రోలుగుంటలో హోరున కురుస్తున్న వర్షం

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని బుచ్చెయ్యపేట, వడ్డాది, సీతయ్యపేట కూడలిలో గంటకుపైగా కురిసిన వర్షానికి రోడ్లపై నీరుచేరి వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. అలాగే వడ్డాది నుంచి చోడవరం వరకు రహదారిలో గోతులన్నీ జలమయమై ద్విచక్ర వాహనదారులు నరకం చూశారు. దీనికితోడు తాచేరు డైవర్షన్ వద్ద వాహనాలు జారడంతో ద్విచక్ర వాహనదారులు మరింత ఇబ్బందులకు గురయ్యారు.

మాడుగులలో...

మాడుగుల రూరల్: మండలంలో బుధవారం తేలికపాటి జల్లులు పడ్డాయి. వేకువజామున వర్షం పడి తెరిపిచ్చింది. మధ్యాహ్నం పన్నెండు గంటలకు మరలా మోస్తరు వర్షం పడింది. వాతావరణం చల్లబడడంతో ఉక్కపోత నుంచి మండల ప్రజలు ఉపశమనం పొందారు.

కొత్త ఎల్లవరంలో తిరంగా ర్యాలీ


తిరంగా ర్యాలీలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు

గొలుగొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త ఎల్లవరం గ్రామంలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో గంగాదేవి ఆలయం నుంచి కొత్త ఎల్లవరం గ్రామం వరకూ జాతీయ జెండాలతో ర్యాలీ సాగించారు. ముందుగా అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. అనంతరం టీడీపీ నేత విజయ్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయానికి త్రివిధ దళాల పోరాట పటిమకు సీఎం మోదీ సమయస్ఫూర్తికి నిదర్శనమన్నారు. ఉగ్రవాదులు అమాయక ప్రజలను పొట్టనపెట్టుకున్నారన్నారు. ఏపీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవణ్ కల్యాణ్ రాష్ట్రంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, రాజేశ్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర, కూటమి నాయకులు గండెం దొరబాబు, ఊడి చక్రవర్తి, ఎ.అప్పలనాయుడు, చిటికెల సాంబమూర్తి, చిటికెల తారకవేణుగోపాల్, కామిరెడ్డి గోవింద్, బీమిరెడ్డి సత్యనారాయణ, కొల్లి రాంబాబు, సత్యనారాయణ, కర్రి నాయుడు, సుర్ల బాబ్జి, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఉత్సవ కమిటీ నియామకం

మాడుగుల, మే 21 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ ఉత్సవ కమిటీని బుధవారం నియమించారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నియామక ప్రక్రియలో మాడుగుల పంచాయతీ పరిధిలోని 16 వార్డుల నుంచి ఒకొక్కరు చొప్పున ఎన్నుకునేందుకు దరఖాస్తులు స్వీకరించగా, 119 దరఖాస్తులు వచ్చాయి. వీటిని డ్రా పద్ధతి తీసి కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. ఈ మేరకు కమిటీ సభ్యులుగా గండి మణికంఠ, ధర్మిశెట్టి త్రిమూర్తులు, పొలిమేర నాయుడు, ఎలిశెట్టి గణేశ్, పుట్టా దినేశ్, ఎడ్ల నరసింహమూర్తి, వేమన గోవింద్, పాలకుర్తి క్రాంతి, కె.అరుణ, బండారు సన్యాసినాయుడు, జొన్నపల్లి రమేశ్, యర్రంశెట్టి కొండలరావు, తాడి గణేశ్, కొప్పోజి రాజు, పుట్టా బలరాం, మామిడి సత్తిబాబు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ అప్పలరాజు మాట్లాడుతూ ఉత్సవానికి 11 రోజులు మాత్రమే సమయం ఉండడంతో పాత కమిటీతో కలిసి పనిచేయాలని, జాతర విజయవంతానికి కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాధు శ్రీనివాసరావు, భీమరశెట్టి పైడయ్యనాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఉత్సవ కమిటీకి నూతనంగా నియామకమైన సభ్యులు

చోడవరంలో త్వరలోనే అన్న క్యాంటీన్: ఎమ్మెల్యే


అన్న క్యాంటీన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు, నాయకులు

చోడవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో త్వరలోనే అన్న క్యాంటీన్ ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. అన్న క్యాంటీన్ ఏర్పాటు కోసం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న పంచాయతీ స్థలాన్ని బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వచ్చే నెల నుంచి క్యాంటీన్ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో నారాయణరావు, టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, సకురు కోటేశ్వరరావు, తానవరపు శ్రీను, ఎలకా మల్లిబాబు. ఎంపీటీసీ సభ్యుడు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొంగశింగి మరిడిమాంబ పండుగ

కృష్ణాదేవిపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కొంగసింగి గ్రామంలో మరిడిమాంబ పండుగ గురువారం జరగనుంది. ఇందుకోసం సర్పంచ్ యలమంచిలి నూకరత్నం, టీడీపీ నేత యలమంచిలి వరహాలబాబు, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే గ్రామంలో విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేశారు. మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీను నిర్వహిస్తామని సర్పంచ్ నూకరత్నం తెలిపారు. అలాగే రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

భోజన పథకం బిల్లుల కోసం నిర్వాహకుల ఆందోళన

చోడవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల విద్యా శాఖ కార్యాలయం ఎదుట నిర్వాహకులు బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నిర్వాహకుల రాష్ట్ర సంఘం అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ నాలుగు నెలలుగా భోజనాల బిల్లులు రాకపోవడంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోతే పథకం ఎలా నడిపించగలమని ఆమె ప్రశ్నించారు. తొమ్మిది, పది తరగతులకు సంబంధించి గత ఏడాది డిసెంబరు నుంచి బిల్లులు రాలేదని, అలాగే కార్మికులకు వేతనాల బిల్లులు కూడా పడలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు లక్ష్మి, నారాయణమ్మ, ఎర్రయ్యమ్మ, దేవుడమ్మ, సత్యవతి, దేవి పాల్గొన్నారు.

వైసీపీ మండల అధ్యక్ష పదవికి సత్యనారాయణ రాజీనామా

గొలుగొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్ష పదవికి లెక్కల సత్యనారాయణ బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు నర్సీపట్నంలో క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేశ్‌కు రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశానని, పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా పనిచేస్తానని పేర్కొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు


పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పారావు

మాడుగుల రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవిల్లి అగ్రహారం, గాదిరాయి గ్రామాల్లో బుధవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. చెత్తా చెదారం తొలగించడంతో పాటు కాలువల్లో పూడికలు తీయించారు. ఎంపీడీవో కొంకి అప్పారావు ఈ పనులు పరిశీలించారు. వర్షాలు పడుతున్నందున మురుగు నిలిచిపోకుండా, వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు ఆయన సూచించారు. పంచాయతీ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

చింతపల్లి ఎస్‌ఐకు ఎస్పీ ప్రశంస



ఎస్పీ బర్దర్ నుంచి ప్రశంస పత్రం, నగదుని అందుకుంటున్న ఎస్‌ఐ వెంకట రమణ

చింతపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడం సమర్థంగా పనిచేసిన స్థానిక ఎస్‌ఐ ఎం. వెంకట రమణను అభినందిస్తూ జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ప్రశంసా పత్రం అందజేశారు. చింతపల్లి స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి పట్టుబడిన కేసులో తమిళనాడుకి చెందిన గంజాయి స్మగ్లర్లు పరారీలో ఉన్నారు. స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా ఆదేశాలతో ప్రత్యేక బృందంతో ఎస్‌ఐ తమిళనాడు వెళ్లి చాకచక్యంగా ఈ గంజాయి ప్రధాన నిందుతులను పట్టుకున్నారు. ఈ మేరకు బుధవారం పాడేరు జిల్లా కార్యాలయంలో ఎస్పీ ప్రశంస పత్రం, నగదుని ఎస్సై వెంకట రమణకు అందజేశారు.

జి. మాడుగులలో దోమల నివారణ చర్యలు

» ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



యాంటీ లార్వా పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

జి.మాడుగుల, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దోమల నియంత్రణకు వైద్య సిబ్బంది సైపేనాక్స్ ఎబైట్‌తో యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు. ఈ నెల 19వతేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'జి.మాడుగులలో దోమల బెడద' శీర్షికన ప్రచురించిన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం స్థానిక పీహెచ్‌సీ ఆరోగ్య విస్తారణాధికారి ఎన్.ప్రకాశ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మురుగు నీరు నిల్వలను గుర్తించి వాటిలో సైపేనాక్స్ ఎబైట్‌తో పిచికారీ చేపట్టారు. 516ఈ జాతీయ రహదారి రోడ్డు సైడ్ వాల్‌లో నిర్మించిన గోతుల్లో నీటి నిల్వలో దోమలు ఉత్పత్తి అవుతున్నట్టు గుర్తించారు. వీటి నివారణకు చర్యలు తీసుకున్నారు.

గిరిజన గ్రామాల్లో ఇంటింటికీ కొళాయిలు: ఎంపీడీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, మే 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో ఇంటింటికీ కొళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తామని స్థానిక ఎంపీడీవో ఉమా మహేశ్వర రావు అన్నారు. బుధవారం మండల పరిషత్‌కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గిరిజన గ్రామానికి నీటి సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారాపథకాలు నిర్మించి ఇంటింటికీ కొళాయి లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికేకొళాయిలు ఏర్పాటు చేసిన ప్రాంతాలను హర్‌ఘర్ జల్ గ్రామాలుగా ప్రకటిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్‌రామ్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో భారీ వర్షం

ముంచంగిపుట్టు, మే 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పలు చోట్ల బుధవారం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలో మాత్రం ఒక మోస్తరు వర్షం పడింది. కొద్ది రోజులుగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ దారెత్తిస్తుంది. సాయంత్రం నుంచి వర్షం పడుతోంది. అకాల వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. మట్టి రహదారులు అధ్వానంగా మారవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండవేడికి విలవిల్లాడుతున్న ప్రజలు ప్రస్తుతం సాయంత్రం వేళల్లో వర్షాలు కురవడంతో వాతావరణం కాస్త చల్లబడటంతో ఉపసమనం పొందుతున్నారు. ఈ వర్షాలు రబీలో వేసిన పంటలకు ఉపయోగమని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ దుక్కులు, ఉద్యాన వన పంటలకు మేలు చేకూరుతుందని చెబుతున్నారు.



కొండచరియలు, వ్యర్థాలతో మూసుకుపోయిన గొట్టాలు



సీలేరు- ధారకొండ రహదారి మధ్యలో ప్రవహిస్తున్న గెడ్డ నీరు

సీలేరు-ధారకొండ రహదారిపై ఐస్‌గెడ్డ నీరు

» తూరలు మూసుకుపోవడంతో ఇబ్బందులు

» గత సెప్టెంబరులో తుపానుకు కొండచరియలు కొట్టుకు వచ్చి పేరుకున్న వ్యర్థాలు

» నేటి వరకు పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

సీలేరు, మే 21 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు ధారకొండ ప్రధాన రహదారి మధ్యలో ఐస్‌గెడ్డ నుంచి నీరు రహదారి కింది నుంచి వెళ్లేందుకు ఏర్పాటుచేసిన తూరలు (తూములు) వద్ద మట్టి, రాళ్లతో కూరుకుపోయాయి. దీంతో ఐస్‌గెడ్డ నుంచి వచ్చే నీరంతా రహదారి పైనుంచే ప్రవహిస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సీలేరు ఐస్‌గెడ్డ నుంచి నిత్యం నీరు ప్రవహిస్తుంటోంది. దుప్పులవాడ పంచాయతీ గాలికొండ, కప్పకొండ కొండలపైన కురిసిన వర్షం నీరంతా ఐస్‌గెడ్డ పై నుంచి కిందికి వస్తోంది. గత ఏడాది సెప్టెంబరు 8 వతేదీన ఈ ప్రాంతంలో వచ్చిన తుఫాన్‌కు వరదనీటితో పాటు కొండచరియలు, బండరాళ్లు కొట్టుకు వచ్చి ఐస్‌గెడ్డ దిగువన ఉన్న రహదారిపై మేటలు వేశాయి. మరికొన్ని బండరాళ్లు ఐస్‌గెడ్డ దిగువన నీరు పోయేందుకు అమర్చిన తూరల్లోకి వెళ్లి మూసుకుపోయాయి. ఆర్అండ్‌బీ అధికారులు రహదారిపై పడిన బండరాళ్లు, చెట్లను మాత్రమే తొలగించారు. తూరల్లో కూరుకుపోయిన వాటిని తొలగించ లేదు. దీంతో అప్పటి నుంచి ఐస్‌గెడ్డ నుంచి వచ్చే నీరంతా రోడ్డు పైనుంచే ప్రవహిస్తోంది. ఈ ప్రాంతంలో భారీ వర్షాలు పడిన సమయంలో రోడ్డుపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని, దీని వల్ల వాహనదారులకు ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఐస్‌గెడ్డ వద్ద తూముల్లో కూరుకుపోయిన రాళ్లు, మట్టిని తొలగించి నీరు రోడ్డుపై నుంచి ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అరకు పార్లమెంట్ స్థాయి మహానాడును విజయవంతం చేయాలి

» జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్, పాడేరు ఇన్‌చార్జి ఈశ్వరి

పాడేరురూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో ఈ నెల 22వ తేదీ గురువారం నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ స్థాయి మహానాడును విజయవంతం చేయాలని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి బుధవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. పార్వతీపురం టీటీడీ కళ్యాణ మండపంలో గురువారం ఉదయం 10 నుంచి జరగున్న ఈ మహానాడుకు అరకు, పాడేరు నియోజకవర్గాల పరిధిలోని తెలుగుదేశం పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీలు, కేఎస్ఎస్‌లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



కొర్రా గ్రామంలో ఒరిగిన కరెంట్ స్తంభం

డుంబ్రిగుడ, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రా పంచాయతీ కేంద్రంలో విద్యుత్ స్తంభానికి తుప్పు పట్టి ఒరిగిపోయింది. ఏ క్షణంలో కూలుతుందోనని స్థానిక గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో ఈ స్తంభం ఇళ్లపై పడే అవకాశం ఉంది. ప్రమాదం చోటు చేసుకోకముందే సంబంధిత అధికారులు స్పందించి స్తంభాన్ని మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తల్లడిల్లిన మాతృ హృదయం

» కొడుకు మృతితో ..కుప్పకూలిన తల్లి

» గంట వ్యవధిలో ఇద్దరూ మృత్యువాత



మృతి చెందిన గొల్లోరి పండు, తల్లి ముత్తి (ఫైల్‌ఫొటోలు)

డుంబ్రిగుడ, మే 21 (ఆంధ్రజ్యోతి): కొడుకు మృతితో ఆ తల్లి కుప్పకూలిపోయింది. కనిపెంచిన కుమారుడు దూరం కావడంతోఆ మాతృమూర్తి గుండె తట్టుకోలేకపోయింది. కొడుకు మృతి చెందిన గంట వ్యవధిలోనే ఆ తల్లీ తనువు చాలించింది. ఈ విషాద ఘటన డుంబ్రిగుడలోని సంతవలస గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలివి.. సంతవలస గ్రామానికి చెందిన గొల్లోరి పండు (43) మంగళవారం రాత్రి పండు నిత్యావసర సరకులను బజారులో కొనుగోలు చేసుకుని తిరిగి ఇంటికి వస్తుండగా స్థానిక జాతీయ రహదారి చికెన్ సెంటర్ ఎదురుగా హఠాత్తుగా ముక్కు, నోటి నుంచి రక్తంతో కుప్పకూలి పోయారు. స్థానికులు 108కు సమాచారమందించారు. వాహన సిబ్బంది వచ్చి పరీక్షించి అప్పటికే ఆయన మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు పండు మృతదేహం వద్దకు చేరారు. ఇదే క్రమంలో మృతుడి తల్లి ముత్తి గొల్లోరి (65) కుమారుడి మృతదేహం వద్ద విలపిస్తూ కుప్పకూలింది. వెంటనే ఆమెను స్థానిక పీ హెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్య సిబ్బంది చికిత్సనందించినా ఫలితంలేకపోయింది. ఆమె గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్య సిబ్బంది నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. గంట వ్యవధిలోనే కొడుకు, తల్లి మృతి చెందడంతో సంతవలసలో విషాదఛాయలు అలు ముకున్నాయి. మృతుడి పండుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

నేటి నుంచి పంచముఖ ఆంజనేయ తృతీయ వార్షికోత్సవం

జి.మాడుగుల, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాంధీనగర్ పంచముఖ ఆంజనేయ ఆలయ తృతీయ వార్షికోత్సవాలు ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్టు సాయి రామ్ స్వామిజీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఆంజనేయ ఆశ్రమాల్లో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వస్తున్నటుట ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గోవాలని జయప్రదం చేయాలని కోరారు.

దేశ సైనికుల పోరాట పటిమ నిరుపమానం

» ఘనంగా తిరంగా ర్యాలీలు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు తిరంగా ర్యాలీని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలిలోని జాతీయ రహదారి వరకు సాగింది. ఆపరేషన్ సిందూర్ విజయవంతంలో అమరులైన వీర జవానుల ఆత్మ శాంతి చేకురాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాంచందర్, కామేశ్వరరావు, ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, ఏపీవో సంగంనాయుడు, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో ర్యాలీ చేస్తున్న అధికారులు, బీజేపీ నాయకులు

హుకుంపేటలో..



హుకుంపేటలో..

హుకుంపేట: భారత జవాన్ల పోరాట స్ఫూర్తి మరువలేనిదని బీజేపీ అరకు నియోజవర్గ ఇన్‌చార్జి పాంగి రాజారావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పాకిస్థాన్‌పై భారత్ అమలు చేసిన సిందూర్ ఆపరేషన్ విజయం పురస్కరించుకుని కూటమి నేతలు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పలు నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్‌లో ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం చేయటంలో మన సైనికులకు విజయం సాధించారన్నారు. దేశ జనం కోసం ప్రాణాలర్పిస్తున్న వారి త్యాగం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. నాయకులు లక్ష్మణుడు, పాండు రంగస్వామి, మత్స్య కొండబాబు, గాసన్న, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టీడబ్ల్యు ప్రధాన కార్యదర్శి దృష్టికి ఆదివాసీల సమస్యలు



ప్రధానకార్యదర్శి ఎం.ఎం.నాయక్‌కు వినతిపత్రమిస్తున్న ఆదివాసీ జేఏసీ నేతలు

పాడేరు, మే 21(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సమస్యలను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.ఎం.నాయక్ దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర తెలిపారు. అమరావతిలో బుధవారం కార్యదర్శిని కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించినట్టు చెప్పారు. ప్రధానంగా షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు శత శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాలని, మెగా డీఎస్సీలో గిరిజన ప్రాంత పోస్టులను మినహాయించి, వాటికి ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా పోస్టులు భర్తీ చేయాలని, ట్రైబల్ అడ్వయిజరీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ నేతలు ముఖి శేషాద్రి, మాసాడ ఈశ్వరరావు, బి.సింహాచలం, కె. శ్రీనివాసరావు, కె.కిశోర్, మక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

'నెలలో 17 రోజులు రేషన్ షాపులు తెరిచి ఉంచాలి'



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాలు (డీఆర్‌డిపోలు) నెలలో 17 రోజులు తెరిచి ఉంచాలని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో డీఆర్ డిపోల సేల్స్‌మేన్‌లతో రేషన్ సరకుల పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ బియ్యం డీఆర్ డిపోల ద్వారా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఎండీయూ వాహనాల ద్వారా సరకులు పంపిణీ కాదన్నారు. మండలంలో 181 రెవెన్యూ గ్రామాలకు 53 డీఆర్ డిపోలు ఉన్నాయన్నారు. సేల్స్‌మేన్‌లు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి రెండు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు డీఆర్ డిపోలు తెరచి ఉంచాలన్నారు. లబ్ధిదారులు ఏ సమయంలో డిపోలకు వచ్చినా బియ్యం పంపిణీ చేయాలన్నారు. నిర్ణీత సమయంలో దుకాణాలు మూసినట్లయితే, చర్యలు తీసుకుంటామన్నారు. 65ఏళ్ల పైబడిన వృద్ధులకు గృహాలకు సరకులు అందజేయనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

స్పెషల్ సాధన కమిటీ కార్యచరణపై సదస్సులు

» కమిటీ చైర్మన్ కాంతారావు



మాట్లాడుతున్న కాంతారావు

పాడేరు రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధనకు ఈ నెల 25వ తేదీ ఆదివారం జిల్లాలోని 22 మండలాల్లో సదస్సులు ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు తీర్మానించినట్టు ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ చైర్మన్ కుడుముల కాంతారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీన జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో స్పెషల్ డీఎస్సీపై, శతశాతం ఉద్యోగ రిజర్వేషన్‌పై చర్చించాలని కోరినా ఫలితంలేకపోయిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 25వ తేదీన ప్రతీ మండలంలో ముఖ్యనాయకులతో సదస్సులను నిర్వహించి 2025- మెగా డీఎస్సీలోనే 5వ షెడ్యూల్ ప్రాంతంలో స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని లేకుంటే, ఈ ప్రాంతంలోని పోస్టులన్నీ ప్రత్యామ్నాయ జీవో ద్వారా భర్తీ చేయాలని డిమాండ్‌ను తీర్మానించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సదస్సులకు రాజకీయాలకతీతంగా ప్రతీ ఆదివాసీలు పాల్గొవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ ఎస్. ధర్మన్నపడాల్, కో-కన్వీనర్ కె.రాధాకృష్ణ, సలహాదారులు సలీమ్, నాగేశ్వరరావు, కో-కన్వీనర్‌లు వి.నాగేశ్వరరావు, బాను, సీహెచ్.రావు, ధనుంజయ్, ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

సెల్ టవర్ చుట్టూ కంచె ఏర్పాటు



జియో టవర్ చుట్టూ కంచె నిర్మిస్తున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెంలో జియో టవర్ వద్ద విద్యుత్ ఎర్తవుతున్నది. ఇటీవల గ్రా మంలోని ఓ గిరిజనునికి చెందిన పశువు ఈ టవర్ వద్దకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. ఈ నేపథ్యంలో టవర్ చుట్టూ రక్షణగా కంచె నిర్మించాలని రెవెన్యూ అధికారులు, జియో నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. కనీసం టవర్ వద్ద విద్యుత్ ఎర్త్ కాకుండా టెక్నికల్ సిబ్బంది పర్యవేక్షించిన దాఖలాలూ లేవు. దీంతో మంగళవారం స్థానిక గిరిజనులు శ్రమదానంతో జియో టవర్ వద్దకు పశువులు వెళ్లకుండగా చుట్టూ కంచెను నిర్మించారు. అయితే, టవర్ చుట్టూ శాశ్వత ఇనుప కంచెను నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

'సమాజాభివృద్ధిలో పాత్రికేయులు భాగం కావాలి'



అరకు ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గంతో యూనియన్ నేతలు

అరకులోయ, మే 21 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో పాత్రికేయులు భాగం కావాలని ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు సీహెచ్‌బీఎల్ స్వామి అన్నారు. బుధవారం అరకులోయలో ప్రెస్‌క్లబ్ ప్రత్యేక సమావేశం అధ్యక్షుడు ఎల్‌బీ వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ, విలేకరులు నిబద్ధతతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలన్నారు. విలేకర్లకు ఇళ్ల స్థలాలకేటాయింపు విషయం రాష్ట్ర కమిటీముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

అనంతరం స్థానిక ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎల్.బి. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా డి.గోవర్ధన్ (అరకులోయ), ఎస్. సోమేష్‌కుమార్ (అరకులోయ), విలియం కేరి (డుంబ్రిగుడ), లక్ష్మణరావు (అనంతగిరి) కార్యదర్శిగా ఆర్.రవి, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.ఆనంద్ (అరకులోయ), ఎం.కృష్ణబాబు (డుంబ్రిగుడ), శ్రీను (అనంతగిరి), కోశాధికారిగా బి.అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా నుంచి సహ ఉపాధ్యక్షులుగా కె.రమేబాబు, ఎస్కే రహిమాన్, సహ సంయుక్త కార్యదర్శులుగా డి.ప్రశాంత్, కె.హరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నేషనల్ కౌన్సిల్ సభ్యుడు బి.నాగరాజు , జిల్లా ఎలక్ట్రానిక్‌మీడియా కార్యదర్శి విజయ్, పాడేరు ప్రెస్‌క్లబ్ పాత్రికేయులు దాసు, సత్యనారాయణ, జె.శ్రీనివాస్, జి.రాజేశ్ పాల్గొన్నారు.

యోగాంధ్ర-2025ను విజయవంతం చేయండి

చింతపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేయాలని ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం యోగా డేను పురస్కరించుకుని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అధ్యక్షతన అవగాహన ర్యాలీ, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ప్రచార కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. మే 27వరకు ట్రైనర్లకు శిక్షణ ఇస్తామన్నారు. 28 నుంచి జూన్ మూడో తేదీ వరకు మండల స్థాయిలో మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇస్తారన్నారు. జూన్ 4 నుంచి 16 వరకు గ్రామ, వార్డు స్థాయిలో శిక్షణ ఉంటుందన్నారు. ట్రైనర్లు ప్రజలకు యోగా శిక్షణ ఇస్తారన్నారు. యోగా దినోత్సవంలో ప్రజలంతా భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వాహణకు మండల స్థాయిలో ఎంపీడీవో చైర్మన్‌గా, పంచాయతీ పరిధిలో కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రశేఖరరావు, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, పీడీ వరలక్ష్మి, ఎంపీహెచ్‌ఈవో స్వామి పాల్గొన్నారు.



గూడెంకొత్తవీధి అవగాహన ర్యాలీలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు



చింతపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

జి.మాడుగుల: ఈ నెల 21 నుంచి జూన్ 21వతేదీ వరకు అన్ని పంచాయతీ కేంద్రాల్లో యోగాంధ్ర- 2025 కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీవో ఎస్. డేవిడ్‌రాజు ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు, రాజకీయ నేతలు, యువజన, మహిళ సంఘాలు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాయంలోని అన్నిశాఖల అధికారులు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, ఎంపీడీవో ఏవీవీ.కుమార్ మాట్లాడుతూ.. నేటి నుంచి జూన్ 21 వరకు జరిగే యోగాంధ్రను మండలస్థాయి అధికారులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రోజూ యోగా సాధన ద్వారా మానసిక ఉల్లాసంతోపాటు ఆరోగ్యంగా ఉంటామని వివరించారు. ఈ కార్యక్రమంలోని సర్పంచ్ రూతు, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, ఎంఈవో బాలాజీ, ఏపీవో అర్జున్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమ్, కార్యదర్శి షేక్ మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరిలో యోగా సాధనలో అధికారులు

గూడెంకొత్తవీధి: స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, టీడీపీ మండలాధ్యక్షుడు ముక్కలి మహేశ్, ఏవో ఇమ్మానుయేలు పాల్గొన్నారు.


పరవాడ సినిమాహాల్ జంక్షన్ సమీపంలో ప్రధాన రహదారిపై పారుతున్న వర్షపు నీరు


జలమయంగా మారిన సబ్బవరం పోలీసు స్టేషన్


కశింకోటలోని తాళ్లపాలెం- నర్సీపట్నం ప్రధాన రహదారి దుస్థితి

ఎటు చూసినా జలమయం

- అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నిలిచిపోయిన నీరు
- పలుచోట్ల రోడ్లపై చేరిన మురుగు
- అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ, విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద మరీదారుణం

అనకాపల్లి టౌన్/తుమ్మపాల/, మే 21 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో అంతటా ఒక్కసారిగా చల్లబడింది. అనకాపల్లిలో తెల్లవారుజాము నుంచి వర్షం పడగా, ఉదయం ఎనిమిది గంటల తరువాత తెరిపిచ్చింది. మళ్లీ పదకొండు గంటల సమయంలో కుండపోతగా కురిసింది. ఈ వర్షపాతం 37.0గా నమోదైనట్టు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ, విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద, ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట, భీమునిగుమ్మం వద్ద, మరికొన్నిచోట్ల వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా మంది చిరు వ్యాపారులు దుకాణాలను తెరవలేదు. వివిధ పనులపై రోడ్లపైకి వచ్చిన ప్రజలు తడిసిముద్దయ్యారు. ఏది ఏమైనా రెండు రోజుల క్రితం వరకు ఉష్ణతాపంతో అలాడిన ప్రజానీకానికి ఈ వర్షం ఉపశమనం కలిగించిందని చెప్పవచ్చు.

ఇలావుంటే, అనకాపల్లిని ఆనుకొని ఉన్న మేజర్ పంచాయతీ తుమ్మపాల పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఎక్కడికక్కడ నీరు నిలిపోవడంతో జనం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా తుమ్మపాల మెయిన్ రోడ్డులోని కొత్తపేటవీధి, పీహెచ్‌సీకి ఎదురుగా, చినబాబుకాలనీ, గుండాల జంక్షన్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారులన్నీ వర్షపునీటితో చెరువులను తలపిస్తున్నాయి. మోకాలు లోతు నీటిలో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. తుమ్మపాల నుంచి దిబ్బపాలెం వెళ్లే జంక్షన్ వద్ద వర్షపునీరు నిలిచిపోవడంతో బవులవాడ, దిబ్బపాలెం, వూడేరు తదితర గ్రామస్థుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

ఇదిలావుంటే, కురిసిన వర్షానికి కొత్తూరు పంచాయతీ పరిధిలోని శారదానగర్‌లో పలువీధులు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోయింది. కాలువలు నిండిపోవడంతో రోడ్లపైకి మురుగు చేరింది. దీంతో రాకపోకలకు జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తే ఈపరిస్థితి ఉండేది కాదని పలువురు వాపోయారు.


కొత్తూరు పంచాయతీ శారదానగర్ 6వ వీధిలో...


తుమ్మపాల పీహెచ్‌సీ వద్ద వర్షపు నీటితో నిండిపోయిన మెయిన్ రోడ్డు

పరవాడ మండలంలో...

పరవాడ/లంకెలపాలెం : మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా కుండపోతగా పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గత కొన్నిరోజులుగా ఎండల కారణంగా అల్లాడిపోయిన ప్రజానీకం ఈ వర్షంతో కాస్త ఉపశమనం పొందారు. భారీ వర్షం వల్ల ఎలమంచిలి- గాజువాక ప్రధాన మార్గంలోని గొర్లెవానిపాలెం, జాజులవానిపాలెం, పరవాడ సినిమాహాల్ జంక్షన్‌లో రహదారి పై నుంచి వర్షపునీరు ప్రవహించింది. వేసవి కారణంగా పూర్తిగా అడుగంటిన పరవాడ పైడమ్మ బందలో కొంత మేర నీరు చేరింది. ఫార్మాసిటీ, వాడచీపురుపల్లి, సింహాద్రి ఎన్టీపీసీ, లంకెలపాలెం ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. కూరగాయల పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేకూర్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే, లంకెలపాలెంతో పాటు పరిసర ప్రాంత గ్రామాలైన మంత్రిపాలెం, సాలాపువానిపాలెం, కన్నూరులలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులపై నుంచి నీరుపారింది. దీంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఈ కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇన్నాళ్లూ ఎండలతో అల్లాడిన జనం ఉపశమనం పొందారు. ఈ వర్షం ఖరీఫ్ పంటలకు మేలు చేస్తున్న రైతులు చెపుతున్నారు. గంటి, వరి నారు మడులను సిద్ధం చేసుకునేందుకు ఉపకరిస్తుందని రైతులు తెలిపారు.

కశింకోట మండలంలో...

కశింకోట : మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏకధాటిగా పడడంతో ప్రతి గ్రామంలోనూ రోడ్లు, కాలువలు నీటితో నిండిపోయాయి. తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వెళ్లే రహదారిలోని సోమవరం సంతవద్ద చెరువును తలపించేలా వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే విధంగా తాళ్లపాలెం కూడలికి కూతవేటు దూరంలో జాతీయ రహదారిపై వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారులకు అవస్థలు తప్పలేదు. అచ్చెర్ల, చెరకాం, కన్నూరుపాలెం రోడ్లు గుంతలుగా మారడంతో అందులో నీరు చేరడంతో ఇది గుర్తించలేని వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.


లంకెలపాలెంలో భారీ వర్షం

సైనికులకు అండగా నిలుద్దాం

- ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ పిలుపు
- సబ్బవరంలో ఉత్సాహంగా టీడీపీ శ్రేణులు తిరంగా ర్యాలీ


సబ్బవరంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

సబ్బవరం, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా నిర్వహించినందుకు సబ్బవరం నుంచి ఇరువాడ జంక్షన్ వరకు ఆంధ్రప్రదేశ్ అయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ ఆధ్వర్యంలో బుధవారం టీడీపీ శ్రేణులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను అంతా చేతబట్టి జై భారత్.., సైనికులకు వందనం అంటూ.. అని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా గండి బాబ్జీ మాట్లాడుతూ ప్రతి భారతీయుడు ప్రశాంతంగా నిద్రపోతున్నాడంటే అందుకు కారణం దేశ సరిహద్దులో ఉన్న మన సైనికులే నన్నారు. వారికి ప్రతి భారతీయుడు కృతజ్ఞతగా ఉండాలని, ప్రతి క్షణం వారికి నైతిక మద్దతునివ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, పార్టీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, తెలుగు యువత అధ్యక్షుడు పీబీవీఎస్ఎన్ రాజు, మాజీ ఎంపీపీ గండి దేముడు, భరణికాన బాబూరావులతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీకి కార్యకర్తలే బలం

- సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- సబ్బవరం మినీ మహానాడులో జిల్లా అధ్యక్షుడు 'బత్తుల'
- ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా : భరోసా ఇచ్చిన నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ


మినీ మహానాడుకు హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు


పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు, చిత్రంలో గండి బాబ్జీ తదితరులు

సబ్బవరం, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంలో కార్యకర్తల శ్రమ ఎంతో ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. ఇక్కడి ఇరువాడలోని జీఎస్ కన్వెన్షన్‌లో బుధవారం టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో ఏర్పాటైన మినీ మహానాడుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. టీడీపీకి పెందుర్తి నియోజకవర్గం కంచుకోటగా పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను అంతా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో టీడీపీ శ్రేణుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, సమస్యలపై వినతులు అందజేయాలని సూచించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ మాట్లాడుతూ కార్యకర్తలంతా ఐకమత్యంతో ఉంటే సమస్యలన్నీ పరిష్కరించుకోవచ్చునన్నారు. కార్యకర్తల సమస్యలన్నీ ఇప్పటికే అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యకర్తలకు ఏదైనా మంచి చేయాలన్న ప్రణాళికతో ఉన్నారన్నారు. త్వరలోనే ఆ విషయం చెపుతారని స్పష్టం చేశారు. ఎవరికి ఎప్పుడు ఏ అవసరం ఉన్నా తనను సంప్రదించాలని సూచించారు.

అంతకు ముందు పలువురు నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ అధికారంలోనే ఉన్నామా..? అన్న అనుమానం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తమకు ఎటువంటి గౌరం ఇవ్వడం లేదన్నారు. అనంతరం నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాకారం, పరవాడ ఎన్టీపీసీ కాలుష్య సమస్య పరిష్కారం, పంచ గ్రామాల సమస్య పరిష్కారం, చంద్రన్న బీమా పథకం అమలు తదితర ముఖ్యమైన అంశాలపై తీర్మానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివా సరావు, నియోజకవర్గ పరిశీలకుడు లొడగల కృష్ణ, పార్టీ నాయకులు పీబీవీఎస్ఎన్ రాజు, గండి దేముడు, దండి వంశీదీప్, భరణికాన బాబూరావు, కొటాన అప్పారావు, ఎం. మహాలక్ష్మీనాయుడు, పైల జగన్నాథరావు, దాట్ల మధు, వియ్యపు చిన్నా, పెద్దాడ రమణమ్మ, సిరపురపు అప్పలనాయుడు, రొంగలి దేముడు, కార్పొరేటర్లు ఎం.ముత్యాలనాయుడు, రౌతు శ్రీనివాసరావు, బల్లా శ్రీను, సేనాపతి వసంత, రాపర్తి కన్నాలతో పాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కమిటీల సభ్యులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

యాదవ సంఘం సబ్బవరం మండల కార్యవర్గం ఎన్నిక


యాదవ సంఘం మండల అధ్యక్షుడుగా ఎన్నికైన సోమేశ్వరరావు, తదితరులు

సబ్బవరం, మే 21 (ఆంధ్రజ్యోతి) : యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా ఇక్కడి గోపాల్‌నగర్‌కు చెందిన కోన సోమేశ్వరరావు ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు భరణికాన సాయినాథరావు ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చట్టి తాతారావు, మొల్లి కనకరాజు, ప్రధాన కార్యదర్శిగా నమ్మి అప్పారావు, కార్య నిర్వాహక కార్యదర్శిగా రేమాల వెంకటేశ్, కార్యదర్శులుగా పల్ల శివనారాయణ, ఉప్పుల దుర్గారావు, కోన రాము, జాయింట్ సెక్రటరీగా సారిపల్లి నాగరాజు, కోశాధికారిగా ఉప్పులి రాజు, జాయింట్ కోశాధికారిగా నక్కెళ్ల సన్యాసినాయుడు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కోరాడ శ్రీనివాసరావు, పల్ల తాతారావు, పల్ల కృష్ణ, ఈపు అప్పలరాజు, గజ్జి నర్సింగరావు, పల్ల సన్యాసిరావు, రాంబాబు, శ్రీరాములు, రాజు, దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

సెలవులకు ఊరెళితే సమాచారం ఇవ్వండి : డీఎస్పీ

అనకాపల్లి రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత పనులు, వేసవి సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి ఊరు వెళితే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. పరవాడ సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన చోరీలను దృష్టిలో ఉంచుకొని లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) కెమెరాలను సిద్ధం చేశామని వివరించారు. ఎవరైనా తమ ఇళ్లకు తాళాలు వేసి ఊరు వెళ్లినట్లైతే తమకు సమాచారం అందిస్తే పోలీసులు ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలను తమ ఇంటికి అమర్చుతారని తెలిపారు. వీటిని అమర్చడం ద్వారా చోరీలు జరిగినా నేరస్థులను పట్టుకునేందుకు వీలుపడుతుందని తెలియజేశారు.

నేడు సబ్బవరంలో ప్రజా దర్బార్

సబ్బవరం, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జనసేన కార్యాలయంలో గురువారం ప్రజా దర్బార్ నిర్వహించనున్నామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో పెందుర్తి, సబ్బవరం, పరవాడ మం డలాలకు చెందిన ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించనున్నామని వివరించారు.

పిడుగు పడి రెండు ఆవులు మృతి


జగన్నాథపురంలో పిడుగు పడి మృతి చెందిన పాడి ఆవులు

సబ్బవరం, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లలపాలెం శివారు గ్రామంలో పిడుగు పడి రెండు పాడి ఆవులు మృతి చెందాయి. ఇందుకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలివి. జగన్నాథపురంలో మంగళవారం రాత్రి మోపాడ అప్పలరాజు అనే రైతు తనకు ఉన్న రెండు పాడి ఆవులను పశువుల పాక బయట, రెండు దూడలను పాకలో కట్టి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం తెల్లవారుజామున ఆవులకు పాలు పితికేందుకు వచ్చి చూడగా, కల్లం బయట కట్టి ఉన్న రెండు ఆవులు చనిపోయి కనిపించాయి. దీంతో కన్నీరుమున్నీరుగా విలపించాడు. మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో పాటు పెద్ద పెద్ద శబ్దాలతో పిడుగులు పడ్డాయని అప్పుడే తన పశువులు చనిపోయాయని వాపోయాడు. వీటి ఖరీదు రూ.లక్షా 80 వేలు ఉంటుందన్నాడు. పాడే జీవనాధారంగా బతుకుతున్న తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాల్సిందిగా కోరాడు.

జిల్లాలో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి : డీపీవో


తుమ్మపాలలో పనులను పర్యవేక్షిస్తున్న శిరీషా రాణి

తుమ్మపాల, మే 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పారిశుధ్య నిర్వహణ పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు డీపీవో శిరీషారాణి తెలిపారు. అనకాపల్లి మండలం తుమ్మపాలలో పారిశుధ్య పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల వలన ప్రజలు రోగాలబారిన పడకుండా గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించడంతో పాటు బ్లీచింగ్ చల్లాలని ఆదేశించామన్నారు. ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం సంపద కేంద్రాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సాలాపునివానిపాలెంలో మరిడిమాంబ పండుగ



లంకెలపాలెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 84వ వార్డు సాలాపునివానిపాలెంలో మరిడిమాంబ పండుగ గురువారం జరగనుంది. ఇందుకు సంబంధించి కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. రాత్రికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళి

కశింకోట, మే 21 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని బుధవారం ఇక్కడ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు మలపురెడ్డి కోటేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రధాన రహదారిలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందేందుకు రాజీవ్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కత్తెర శ్రీధర్, కట్టమూరి నూకఅప్పారావు, వెంకట సత్యనారాయణ, తుట్ట రమణ, సత్యనారాయణ, బోయిన భానుమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పరవాడ, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీలోని మెట్రోకెమ్ ఫార్మా కంపెనీ యాజమాన్యం నిర్మించిన పంచముఖ ఆంజనేయ ఆలయంలో బుధవారం స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఉదయం 8.51 గంటలకు కంపెనీ ఎండీ ఎన్.వెంకటేశ్వరరావు దంపతులచే విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం విజ్ఞాన సమితి వద్ద ఉన్న అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ఉదయం విశేష పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రతో పాటు సామాజికవేత్త కాండ్రేగుల శ్రీరామ్, మళ్ల ఉషాసాగర్, యల్లపు దివాకర్, పరదేశినాయుడు, దాడి శ్రీనివాసరావు, ఆళ్ల శ్రీను, జోగేశ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

నేడు అనకాపల్లిలో తిరంగా ర్యాలీ

అనకాపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో గురువారం అనకాపల్లి పట్టణంలో ఎంపీ సీఎం రమేశ్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని రింగ్‌రోడ్డు కూడలి నుంచి నెహ్రూ చౌక్ వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి యువకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

మలేరియా నివారణపై ప్రత్యేక శ్రద్ధ

- ప్రాథమిక స్థాయిలోనే నివారణకు కార్యాచరణ
- ఎన్‌వీబీడీసీపీ డిప్యూటీ డైరెక్టర్ రామనందం



మలేరియా అధికారులు, పిచికారీ కార్మికులకు సూచనలు ఇస్తున్న ఎన్‌వీబీడీసీపీ డిప్యూటీ డైరెక్టర్ రామనందం

చింతపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని జాతీయ వాహక సంబంధ వ్యాధుల నియంత్రణ కార్యక్రమం(ఎన్‌వీబీడీసీపీ) డిప్యూటీ డైరెక్టర్ ఏటీ రామనందం తెలిపారు. బుధవారం చింతపల్లి మండలంలో పర్యటించిన ఆయన స్థానిక ఏరియా ఆస్పత్రి, లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. చెరుకుంపాకలు గ్రామంలో జరుగుతున్న దోమల నివారణ మందు పిచికారీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్ల కలిగే వ్యాధులను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గిరిజన ప్రాంతంలో ప్రధానంగా మలేరియా నిర్మూలనకు చర్యలు చేపట్టిందన్నారు. మలేరియాతో ఒక్కరు కూడా మరణించరాదన్నారు. గిరిజన ప్రాంతంలో మలేరియా కేసులను సకాలంలో గుర్తిస్తున్నట్టు చెప్పారు. గ్రామ స్థాయిలోనే మలేరియాను గుర్తించేందుకు ఆశ కార్యకర్తల వద్ద వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉంచామన్నారు. గత ఏడాది మలేరియా కేసులు నమోదైన గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నట్టు చెప్పారు. రెండవ విడతలో ప్రతి గ్రామంలోనూ దోమల నివారణ మందు పిచికారీ చేస్తామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో మలేరియా రోగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జ్వర బాధితులకు సకాలంలో రక్త పరీక్ష చేయడం, వ్యాధి నిర్ధారణ జరిగితే వెంటనే చికిత్స ప్రారంభించాలన్నారు.

మలేరియా నిర్మూలనకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) తులసి, ఏఎంవో సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారులు బుక్కా చిట్టిబాబు, కన్నబాబు, ఎంటీఎస్‌లు గుమ్మ యుగంధర్, శ్రావణి పాల్గొన్నారు.

500 ఎకరాలకు సాఫీగా నీరు

- 150 మంది ఉపాధి శ్రామికులు రెండు వారాలపాటు శ్రమించి పూడిక తీత, తుప్పలు తొలగింపు



పూడిక తీయక ముందు కాలువ పరిస్థితి



కాలువలో పూడిక తీసి, తుప్పలు తొలగిస్తున్న ఉపాధి హామీ పథకం శ్రామికులు

మునగపాక, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరబుపాలెం మునగపాక ముసిలితల్లి ప్రాంతం నుంచి పెద్దపాడు వరకు ఉపాధి హామీ పథకం కింద సాగునీటి కాలువలో పూడిక తీత పనులు చేట్టారు. రోజుకు 150 మంది ఉపాధి శ్రామికులు రెండు వారాలపాటు పనిచేసి సుమారు రెండున్నర కిలో మీటర్ల పొడవు వున్న ఈ కాలువలో పూడిక తీసి, తుప్పలు తొలగించారు.

అంతకుముందు కాలువలో పూడిక పేరుకుపోయి, పిచ్చిమొక్కలు పెరిగిపోయి నీరు సరిగా పారక రైతులు ఇబ్బంది పడ్డారు. స్థానిక రైతుల వినతి మేరకు కూటమి ప్రజాప్రతినిధులు, నేతలు స్పందించి ఉపాధి హామీ పథకం కింద పంట కాలువలో పూడిక తీయించారు. కృష్ణరాజు ప్రధాన కాలువ నుంచి ఈ కాలువ ద్వారా 500 ఎకరాలకు సాగునీరు సాఫీగా అందుతుందని రైతులు ఆనందంతో చెబుతున్నారు.





బీఎన్ రోడ్డులో మేడివాడ వద్ద ఏర్పడిన భారీ గోతుల్లో నిలిచిన వర్షం నీరు

వర్షం పడితే చెరువులే!

- మరింత అధ్వానంగా బీఎన్ రోడ్డు పరిస్థితి
- భారీ గోతుల్లో నీరు చేరి వాహనదారుల ఇక్కట్లు

రావికమతం, మే 21 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలో భీమునిపట్నం- నర్సీపట్నం రోడ్డు మరింత అధ్వానంగా మారింది. రావిమతం నుంచి మేడివాడ వరకు పలుచోట్ల రోడ్డు మొత్తం గతంలోనే ధ్వంసమై భారీ గోతులు ఏర్పడ్డాయి. వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము, ధూళి విపరీతంగా ఎగిసిపడి ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రెండు, మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో దుమ్ము సమస్యపోయి, బురద సమస్య నెలకొంది. గర్నికం బాల చెంచుమ్మ ఆర్చి సమీపంలో గతంలో ఏర్పడిన గోతులను స్థానికులు మట్టితో పూడ్చారు. ఇప్పుడు వర్షం పడుతుండడంతో చిత్తడిగా తయారై నడవడానికి వీలుకాని పరిస్థితి ఏర్పడింది. మత్సవానిపాలెం నుంచి కొత్తకోట వరకు రోడ్డు మొత్తం ఇలాగే వుంది. మేడివాడ వద్ద రోడ్డుపై పలుచోట్ల భారీ గోతులు ఏర్పడి వర్షం నీరు నిలిచిపోయి పంట కుంటాల్లా మారాయి. రావికమతం నుంచి మేడివాడ వరకు మూడు కిలోమీటర్లు, మత్సవానిపాలెం నుంచి కొత్తకోట వరకు ప్రయాణించడానికి గంటల సమయం పడుతున్నదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మేడివాడ వద్ద రోడ్డుపై ఏర్పడిన గోతులను కాంక్రీట్ మిక్సర్‌తో కప్పగా, వర్షాలతో కాంక్రీట్ లేచిపోయి గోతులు మళ్లీ దర్శనమిచ్చాయి.

ఫ్లై ఓవర్లు కూడా అవసరం

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి నారాయణ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేల డిమాండ్
- నియోజకవర్గాల్లో ప్రతి అభివృద్ధి పనీ ఎమ్మెల్యేలకు చెప్పాకే చేపట్టాలి
- ఇకపై ప్రతి నెలా సమీక్షా సమావేశం నిర్వహిస్తామని మంత్రి వెల్లడి
- సింహాచలం పంచ గ్రామాల సమస్య, అనకాపల్లి ల్యాండ్ పూలింగ్, బీచ్ కారిడార్ వంటి అంశాలపై త్వరలో కీలక నిర్ణయం



సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి నారాయణ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు

విశాఖపట్నం, మే 21 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తి కావస్తున్నందున...కనెక్టివిటీ కోసం వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ రహదారులు నిర్మిస్తున్నదని, అయితే నగరంలో ట్రాఫిక్ రద్దీ తట్టుకోవడానికి ఫ్లైఓవర్లు కూడా అవసరమని ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. వీఎంఆర్‌డీఏలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ బుధవారం సమావేశం నిర్వహించగా, ఎమ్మెల్యేలంతా వారి వారి సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సూచనలు తెలియజేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ నుంచి భీమిలి వరకు బీచ్‌ను జోన్లుగా విభజించి వాటర్ స్పోర్ట్స్ ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా సింహాచలం బీఆర్‌టీఎస్ కారిడార్‌లో ఇళ్లస్థలాలు కోల్పోయిన వారికి ఇచ్చిన టీడీఆర్‌లు ఆన్‌లైన్‌లో విక్రయించుకునే అవకాశం కల్పించాలన్నారు. అధికారులు ఏమైనా అభివృద్ధి పనులు ప్రతిపాదించినప్పుడు వాటిని ముందుగా ఎమ్మెల్యేలకు తెలియజేయాలని చెప్పగా, స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమర్థించారు. నాయకులు వారి పార్టీ మైలేజీ కోసం వాటిని ప్రచారం చేసుకుంటారని, ప్రజలకు చేరువగా తీసుకువెళతారని, ఇరు వర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయానికి వెళ్లాలంటే రెండు గంటల సమయం పడుతుందని, ట్రాఫిక్ సమస్య తీరేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. మారియట్ హోటల్ వద్ద ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇచ్చారని, స్థలానికి టీడీఆర్‌లు ఇవ్వాలని కోరారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రహదారుల నిర్మాణాలపై మాట్లాడారు. మరికొందరు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా జీవీఎంసీ వాటర్ పైపులైన్లు త్వరగా పూర్తిచేయాలని, ఎక్కడికక్కడ నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని కోరారు. కొండవాలు ప్రాంతాల్లో వ్యర్థాలను తరలించే వాహనాల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. పేదల వద్ద 2014లో డీడీలు కట్టించుకున్నామని, వారికి ఇళ్లు అప్పగించాలని మరో ఎమ్మెల్యే కోరారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ, సింహాచలం పంచ గ్రామాల సమస్య, అనకాపల్లి ల్యాండ్ పూలింగ్, బీచ్ కారిడార్ వంటి అంశాలపై త్వరలోనే కీలక నిర్ణయాలు వస్తాయన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ఇకపై ప్రతి నెలా సమీక్షా సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాస్, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, విజయనగరం కలెక్టర్ అంబేద్కర్, అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, పురపాలక శాఖ కమిషనర్ సంపత్‌కుమార్, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో యావజ్జీవ ఖైదు

- ఎలమంచిలి వద్ద లారీ డ్రైవర్‌ను చంపేసిన క్లీనర్
- ఇద్దరిదీ విజయవాడ
- నేరం రుజువు కావడంతో తీర్పు వెలువరించిన విశాఖ రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి

ఎలమంచిలి, మే 21 (ఆంధ్రజ్యోతి): లారీ యజమాని కమ్ డ్రైవర్ హత్య కేసులో ముద్దాయి అయిన క్లీనర్‌కు జీవిత ఖైదుతోపాటు 10 వేల రూపాయల జరిమానా విధిస్తూ విశాఖలోని రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి సీకే గాయత్రి బుధవారం తీర్పు చెప్పారని పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆమె వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

విజయవాడకు చెందిన పాశం మల్లికార్జునరావు (40)కు సొంతంగా లారీలు వున్నాయి. ఇతను డ్రైవర్‌గా కూడా వెళుతుంటాడు. ఇతని వద్ద విజయవాడకే చెందిన పిండి నాగరాజు అనే వ్యక్తి క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. 2015 నవంబరు 15న మల్లికార్జునరావు విజయవాడలో పెయింట్ లోడ్ ఎక్కించుకుని పశ్చిమబెంగాల్‌లోని సిలిగురి వెళ్లాడు. క్లీనర్‌గా పిండి నాగరాజు వున్నాడు. అక్కడ సరకు అన్‌లోడ్ చేసిన తరువాత కోల్‌కతా వచ్చి, టీ పొడి లోడు ఎక్కించుకుని బెంగళూరుకు బయలుదేరారు. దారిలో ఒకచోట నాగరాజు మద్యం సేవించడంతో మల్లికార్జునరావు మందలించాడు. నవంబరు 30వ తేదీ తెల్లవారుజామున ఎలమంచిలి సమీపంలోని ఎర్రవరం చేరుకున్నారు. బడలికగా వుండడంతో మల్లికార్జునరావు నిద్రకు ఉపక్రమించాడు. మద్యం సేవించినందుకు తనను మందలించాడని కక్ష పెట్టుకున్న నాగరాజు.. జాకీ రాడ్‌తో మల్లికార్జునరావు తలపై బలంగాకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మల్లికార్జునరావు జేబులో వున్న రూ.4,300 నగదు, సెల్‌ఫోన్ తీసుకుని, మృతదేహాన్ని సమీపంలోని కాలువలో పడేశాడు. అనంతరం లారీతోసహా పరారయ్యాడు. లారీని బెంగళూరు తీసుకెళ్లి, సరకు అప్పగించి లారీ కిరాయి తీసుకున్నాడు. కాగా ఎర్రవరం సమీపంలో మృతదేహం పడివున్నట్టు అప్పటి వీఆర్వో జె.చిరంజీవిరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. కాగా తన తండ్రి కనిపించడం లేదంటూ మల్లికార్జునరావు కుమారుడు చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలమంచిలి పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో గుర్తు తెలియని మృతదేహం మల్లికార్జునరావుదేనని గుర్తించారు. పోలీసులు విచారణ జరపగా.. పిండి నాగరాజు హత్య చేసినట్టు తెలిందింది.దీంతో అదే ఏడాది డిసెంబరు 1వ తేదీన హత్య కేసుగా మార్చి, ప్రధాన నిందితుడు పిండి నాగరాజు పేరును చేర్చారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ వెంకటరావు కేసు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. విశాఖపట్నం 2వ అదనపు జిల్లా కోర్టులో కేసు విచారణ జరిగింది. పోలీసుల తరపున కేసును ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు వాదించారు. పిండి నాగరాజుపై పోలీసులు మోపిన అభియోగం రుజువు కావడంతో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

యూఎస్‌ఏ వినియోగదారులే టార్గెట్

... 5వ పేజీ తరువాయి

వస్తువు డెలివరీ అవుతుందని చెబుతున్నారు. వస్తువులకు బదులు ఖాళీ పార్శిల్ ప్యాకెట్లను కస్టమర్లకు పంపి డబ్బులు గుంజుతున్నట్టు తెలిసింది. వీరు నాలుగు గ్రూపులుగా విడిపోయి ఆన్‌లైన్ మార్కెటింగ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్టు తెలిసింది. ఇక్కడి వ్యవహారం అంతా ముంబై నుంచి ఒక మహిళ ఆధ్వర్యంలో నడుస్తున్నదని సమాచారం. ఇక్కడ సుమారు వంద మంది పనిచేస్తున్నారని, 50 కంప్యూటర్లు వున్నాయని, ఒక్కొక్కరికి నెలకు రూ.20 వేల చొప్పున జీతాలు చెల్లిస్తున్నట్టు పోలీసుల విచారణలో తెలినట్టు తెలిసింది. సుమారు ఏడాది నుంచి ఇక్కడ సాగుతున్న ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో రూ.3 కోట్ల వరకు వినియోగదారుల నుంచి వసూలు చేసినట్టు సమాచారం. కాగా అచ్యుతాపురంలో సోదాలు, పలువురిని అదుపులోకి తీసుకున్న విషయమై డీఎస్పీ విష్ణుస్వరూప్‌ను వివరణ కోరగా.. ఇంకా సమాచారం సేకరిస్తున్నామని, పూర్తి వివరాలను త్వరలో మీడియా ద్వారా వెల్లడిస్తామన్నారు.

దంచికొట్టిన వాన

... 5వ పేజీ తరువాయి

పరీవాహక ప్రాంతాలైన గొలుగొండ, కొయ్యూరు, చింతపల్లి మండలాల్లో వర్షం పడడంతో జలాశయంలోకి 200 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్టు ప్రాజెక్టు డీఈఈ అనురాధ తెలిపారు. గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 365 అడుగులు వుందని ఆమె చెప్పారు.

సబ్బవరం మండలం గొల్లలపాలెం శివారు జగన్నాథపురంలో మంగళవారం తెల్లవారుజామున పిడుగులు పడి మోపాడ అప్పలరాజుకు చెందిన రెండు ఆవులు మృతి చెందాయి. వీటి విలువ రూ.1.8 లక్షలు వుంటుందని బాధిత రైతు వాపోయారు. మునగపాక మండలం వాడ్రాపల్లిలో పిడుగుపడి బీశెట్టి జోగినాయుడుకు చెందిన ఆవు మృతిచెందింది. కశింకోట మండలం తాళ్లపాలెంలో నూతిగట్టు మల్లేశ్వరరావుకు చెందిన భవనంపై పిడుగు పడడంతో పిట్టగోడ దెబ్బతిన్నది. ఇంటిలోని విద్యుత్ వైర్లు, ఇన్వర్టర్ కాలిపోయాయి.

పరవాడ పరిసర ప్రాంతాల్లో గంటకుపైగా భారీ వర్షం కురిసింది. గొర్లెవానిపాలెం, జాజులవానిపాలెం, పరవాడ సినిమాహాల్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో రహదారులు నీటమునిగాయి. రావికమతం, రోలుగుంట మండలాల్లో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది.

తీవ్ర వడగాడ్పులు వీచాల్సిన సమయంలో సాధారణ వాతావరణానికి భిన్నంగా ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులతోపాటు వర్షాలు కురుస్తున్నాయి. ఎండ తీవ్రత ఏమాత్రం లేకపోవడంతో ఉష్ణోగ్రతలు సాధారణస్థాయిలోనే నమోదు అవుతున్నాయి. వాతావరణం ఆహ్లాదకరంగా వుండడంతో ప్రజలు ఉపశమనం చెందుతున్నారు.



అనకాపల్లిలో భారీ వర్షం

క్రైం... crime news

చిన్నారి రోహిత కిడ్నాప్ కేసులో మరో ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ మోహనరావు, వెనుక వరుసలో నిందితులు

అనకాపల్లి టౌన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోకావారివీధికి చెందిన చిన్నారి రోహిత కిడ్నాప్ కేసులో పట్టణ పోలీసులు మరో ముగ్గురిని అరెస్టు చేసి బుధవారం కోర్టుకు తరలించారు. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితురాలు టొంటోని లక్ష్మి, ఆమె భర్త అప్పలస్వామిలను ఈ నెల 17వ తేదీన అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు అయిన లోకావారివీధికి చెందిన బోనాల దేవి ఎలియాస్ చవితిన దేవి, గాంధీనగరం వీధికి చెందిన తగరంపూడి షణ్ముఖ ఎలియాస్ శంకర్, కశింకోట మండల ఏఎస్‌పేటకు చెందిన గొర్లి శ్రీనివాసరావులను మంగళవారం సాయంత్రం గూడ్స్‌షెడ్డు వద్ద అరెస్టు చేసినట్టు అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహనరావు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడిం చారు. కశింకోట మండలం ఏఎస్‌పేటకు చెందిన గొర్లి శ్రీనివాసరావు సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఆయనకు పెళ్లయి సుమారు 18 ఏళ్లు కావస్తున్నా పిల్లలు లేరు. పిల్లలు లేనందున లీగల్‌గా దత్తత తీసుకోవడం కష్టమని భావించి అక్రమంగా పిల్లలను పొందాలనే ఉద్దేశంతో సిమెంట్ ఫ్యాక్టరీలో తనతో పనిచేస్తున్న గాంధీనగరం వీధికి చెందిన తగరంపూడి షణ్ముఖ ఎలియాస్ శంకర్‌ను సాయం కోరాడు. దానికి షణ్ముఖ అంగీకరించి చవితిన దేవిని సంప్రతించి విషయం చెప్పాడు. పాప గాని బాబు గాని ఎలాగైనా అతనికి ఇవ్వడానికి ఒప్పుకొని ఇందుకు గాను రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పింది. ఈ విషయాన్ని శ్రీనివాసరావుకు షణ్ముఖ చెప్పి అడ్వాన్స్‌గా డబ్బులు ఇమ్మని కోరాడు. దీంతో బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి లక్ష రూపాయలను షణ్ముఖకు శ్రీనివాసరావు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. ఇందులో దేవికి షణ్ముఖ రూ.30 వేలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. అనంతరం గాజువాకలో తనకు తెలిసిన టొంటోని లక్ష్మి, ఆమె భర్త అప్పలస్వామి సహకారంతో ఈ నెల 14న లోకావారివీధికి చెందిన భీశెట్టి హరీశ్, లలిత దంపతుల నాలుగేళ్ల కుమార్తె రోహితను కిడ్నాప్ చేశారు. అదే రోజు ఆ చిన్నారిని లక్ష్మి తీసుకెళ్లిపోయింది. మర్నాడు తన కుమార్తె కనిపించడం లేదని బాలిక తల్లి లలిత పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి కిడ్నాప్ కేసుగా నమోదు చేసి చిన్నారిని అపహరించిన పెదగంట్యాడకు చెందిన లక్ష్మి, అప్పలస్వామిలను 17వ తేదీన అరెస్టు చేశారు. వారిచ్చిన వాంగ్మూలం ప్రకారం కేసులో ప్రధాన నిందితురాలు చవితిన దేవి గురించి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ గాలింపులో భాగంగా పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్‌కు అందిన సమాచారం మేరకు గూడ్స్‌షెడ్డు జంక్షన్‌లో దేవితో పాటు షణ్ముఖ, గొర్లి శ్రీనివాసరావులను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసి విచారించగా చేసిన నేరం బయటపడిందని డీఎస్పీ తెలిపారు. నిందితులు షణ్ముఖ నుంచి రూ.70 వేలు, శ్రీనివాసరావు నుంచి రూ. 750లు, దేవి నుంచి రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరుపరిచామని డీఎస్పీ చెప్పారు. విలేకరుల సమావేశంలో సీఐ టీవీ విజయ్‌కుమార్‌తో పాటు ఎస్ఐలు వెంకటేశ్వరరావు, ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం.. 24 మందికి కాట్లు

పాడేరురూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): పాడేరులో బుధవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కనిపించిన వారందరిపైనా దాడిచేసి కరిచింది. తొలుత పాత పాడేరులో విచ్చలవిడిగా తిరుగుతూ 12 మందిని గాయపరిచింది. తరువాత పక్కనే ఉన్న కిండంగి పంచాయతీ నక్కలపుట్టుకు వెళ్లి మరో 12 మందిని కరిచింది. విషయం తెలుసుకున్న ఈవోపీఆర్‌డీ ఆర్‌వీఎస్.రమేశ్, పారిశుధ్య కార్మికులతో కలిసి నక్కలపుట్టు వెళ్లారు. అప్పటికే స్థానికులు కర్రలతో కొట్టి హతమార్చారు. పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారు జిల్లా ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎస్.రాయవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): మెట్ల పైనుంచి జారి పడి తీవ్రంగా గాయపడిన ఓ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందిందని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. దీనికి సంబంధించి బుధవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని సైతారుపేట గ్రామానికి చెందిన వీసం లక్ష్మి(35) ఈ నెల 17న ఇంట్లో ప్రమాదవశాత్తూ మెట్ల పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడింది. ఆమెను కుటుంబ సభ్యులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి

కె.కోటపాడు, మే 21 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఎ.కోడూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతనవలస గ్రామానికి చెందిన చిరికి మనోజ్ (24) ఈ నెల 17వ తేదీ రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఆర్‌ఫై అగ్రహారంలో స్నేహితుడి వివాహానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. అగ్రహారం శివారులో రోడ్డుపై పడి వున్నచెట్టు కొమ్మను చీకట్లో గమనించక బలంగా ఢీకొన్నాడు. దీంతో తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కె.కోటపాడులోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మనోజ్ తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

మద్యం రవాణా చేస్తున్న వాహనాలు బోల్తా

ఎలమంచిలి, మే 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు చోట్ల మద్యం తరలించే వాహనాలు బోల్తా పడ్డాయి. మద్యం సీసాలు నేలపాలు కాగా, ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. జిల్లాలోని డిస్టలరీ నుంచి పలు ప్రాంతాలకు మద్యం సీసాలను సరఫరా చేసే ఓ వ్యాన్ పులపర్తి వద్ద జాతీయ రహదారిపై బుధవారం ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. అదే విధంగా తండాల దిబ్బ జంక్షన్ వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని మద్యం తరలించే వ్యాన్ ఢీకొని బోల్తా పడింది. మంగళవారం జరిగిన ఈ సంఘటనలో సుమారు రూ.2 లక్షల విలువైన మద్యం సీసాలకు నష్టం వాటిల్లిందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

కూటమిలో ఆధిపత్య పోరు

... 5వ పేజీ తరువాయి

గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులైన పల్లా శ్రీనివాసరావు కల్పించుకొని చేసిన సేవలను గుర్తించి కొందరికి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించామని, వారు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే మరికొందరికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చామని, వారు ఏదైనా అంశంపై సలహాలు మాత్రం ఇవ్వవచ్చునన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాటే చెల్లుబాటు అవుతుందని స్పష్టంచేశారు. పార్టీ రాష్ట్ర నాయకుడిగా పల్లా శ్రీనివాసరావు స్పష్టత ఇవ్వడంతో ఆయా నియోజకవర్గాల్లో ఇకపై విభేదాలు తగ్గుతాయని భావిస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549